

మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంటే.. నవ్యాంధ్రలో స్వర్ణయుగం సాకారం అవుతుంది.సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింది. రాష్ట్రంలో పలుమార్లు అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 2లక్షల పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీదే.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ


శనివారం 01.08.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 101 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# రెక్కలు విప్పిన ఉత్తరాంధ్ర



## నేడు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం

## తెలుగు సంస్కృతి, గిరిజన సంప్రదాయాల వైభవానికి ప్రపంచ వేదిక

## అభివృద్ధికి కొత్త ఇంజిన్‌గా ఎయిర్‌పోర్టు



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ విమానాశ్రయాన్ని ఏవియేషన్, ఏరోస్పేస్ హబ్ గా తీర్చిదిద్దాలని సూచించారు. ఏఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేలా కార్యక్రమం నిర్వహించాలని సీఎం సూచించారు. విశాఖలోని పోర్టు గెస్ట్ హౌస్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలుగు కళలు, సంస్కృతీ వారసత్వ వైభవాన్ని చాటేలా విమానాశ్రయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతీ, సంప్రదాయాలు, కళలు ఉట్టిపడేలా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అలంకరించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విమానాశ్రయ స్వాగత ద్వారం వద్ద ఆకట్టుకునేలా భారీ స్థాయి ఏటికొప్పాక కళాకృతి ఏర్పాటు చేశామన్నారు. విమానాశ్రయ ప్రాంగణం లోపల ఆంధ్రప్రదేశ్ సంస్కృతికి అద్దం పట్టేలా తోలు బొమ్మలు, బొబ్బిలి వీణ, నాదస్వరం, లేపాక్షి నంది చిత్రాలతో పాటు భౌగోళిక వారసత్వాన్ని చాటే బంగినపల్లి మామిడి లాంటి చిత్రాలను అలంకరించామని సీఎంకు వివరించారు. ప్రత్యేకించి ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేలా 13,500 మంది గిరిజన మహిళలతో థింసా నృత్యాన్ని కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. రిహార్సల్ గా చేసిన ఈ నృత్యానికి గిన్నీస్ వరల్డ్ రికార్డు కూడా సాధించినట్టు ముఖ్యమంత్రికి మిగతా 2లో...



# స్వాగతం మోదీ జీ... సిద్ధమైన ఉత్తరాంధ్ర

## భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త గేట్‌వే అంటూ సీఎం చంద్రబాబు

2లో



## ముసాయిదా ఓటరు జాబితా విడుదల



- 3.71 కోట్ల మంది ఫారాల సమర్పణ
- 89.22% మంది ఎన్యూమరేషన్ పూర్తి
- ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్
- అక్టోబర్ 3న తుది జాబితా

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో 3.71 కోట్ల మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించగా, ఇది మొత్తం ఓటర్లలో 89.22 శాతంగా నమోదైందన్నారు. మిగతా 2లో...

## సూర్య సరోవర్ యోజనకు రూ.5070 కోట్లు



- కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు
- పీఎం-కిసాన్‌కు మరో ఐదేళ్ల పొడిగింపు
- సముద్ర మంథన్, ఖేలో ఇండియాకు ఆమోదం

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దేశీయ ఇంధనం, వ్యవసాయం, సముద్ర ఆధారిత వనరులు, క్రీడారంగాల సమగ్ర వికాసం లక్ష్యంగా రూ. 4.25 లక్షల కోట్లకు పైగా విలువైన 4 ప్రధాన పథకాలకు, వాటి పొడిగింపులకు ఆమోదం తెలిపింది. ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ సాధనలో ఈ నిర్ణయాలు కీలక మైలురాయిగా నిలవనున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకాల ద్వారా ఇంధన స్వయం సమృద్ధి, రైతు సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పురోగతి, క్రీడా రంగానికి అంతర్జాతీయ స్థాయిలో ఊతం లభిస్తుందని తెలిపింది.
ఫ్లోటింగ్ సోలార్ ఫోటోవోల్టాయిక్ ప్రాజెక్టుల అభివృద్ధికి రూ. 5,070 కోట్ల ఆర్థిక వ్యయంతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన' పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2026-27 నుండి 2030-31 వరకు అమలు కానున్న ఈ పథకం ద్వారా కనీసం రెండు గంటల స్టోరేజ్ సామర్థ్యంతో మిగతా 2లో...

## భోగాపురం ఫ్లైట్ షెడ్యూల్ విడుదల



- ఆగస్టు 17 నుంచి ఎయిరిండియా సేవలు
- హైదరాబాద్, విజయవాడ, బెంగళూరుకు విమానాలు
- నేడు ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం

2లో

## శ్రీశైలం జలాశయానికి వరద..



**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి శ్రీశైలానికి 1,05,709 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతోంది. మిగతా 2లో...

## మహిళల్ని అవమానించడం వైసిపి డిఎన్ఎలోనే ఉంది



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళల్ని అవమానించి రాక్షస ఆనందం పొందడం వైసిపి డిఎన్ఎలోనే ఉందని టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విమర్శించారు. సొంత తల్లిని, చెల్లిని గెంటేసిన చరిత్ర వైసిపి అధినేత వైఎస్ జగన్‌దైతే కనిపించిన ప్రతి మహిళను అవమానించడం ఆ పార్టీ నాయకులు సంస్కృతి అని శుక్రవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. శ్రీకాకుళంలో విధుల్లో ఉన్న మహిళా ఎస్ఐపై వైసిపి నాయకులు ప్రవర్తించిన తీరు తీవ్ర ఆక్షేపణీయమని తెలిపారు. మహిళల భద్రత, గౌరవంతో చెలగాటమాడితే సహించేది లేదని, చట్టాన్ని అతిక్రమించి మహిళా అధికారిపై దాష్టీకానికి ఒడిగట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**నేరస్థుడిని పరామర్శించడం ఆశ్చర్యకరం: గొట్టిపాటి రామకృష్ణ :** మాజీముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేరస్థుడిని పరామర్శించడానికి వెళ్లడం తీవ్ర ఆశ్చర్యకరమని టిడిపి నేత గొట్టిపాటి రామకృష్ణ అన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన స్వార్థ రాజకీయాల కోసం చట్టాలను, నిబంధనలను పూర్తిగా జగన్ పక్కనబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి దేశ ప్రధాని వస్తున్న వేళ, ప్రోటోకాల్, భద్రతా చర్యలను విచ్ఛిన్నం చేసేలా వ్యవహరించారని పేర్కొన్నారు. శాంతిభద్రతలను కాపాడే విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులపై దౌర్జన్యానికి దిగడం, వారిపై బలప్రయోగం చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి జగన్ సాధించిందేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## 19 వర్సిటీల పాలక మండళ్ల రద్దు




- నామినేటెడ్ సభ్యుల తొలగింపు
- పాలక మండళ్ల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం శ్రీకారం
- ఏయూకు కొత్త గవర్నింగ్ బాడీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీలోని యూనివర్సిటీల పాలనలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. 19 విశ్వవిద్యాలయాల పాలక మండళ్లను రద్దు చేస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో నియమించిన నామినేటెడ్ సభ్యులను తొలగించింది. ఈ మేరకు ఆయా విశ్వవిద్యాలయాల గవర్నింగ్ బాడీల రద్దుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. క్లాజ్-2 కింద నియమితులైన పాలక మండలి సభ్యులపై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. - 2లో...


## థింసాతో ప్రపంచ రికార్డు



- 13 వేల మంది గిరిజన కళాకారుల ఏకకాల ప్రదర్శన
- గిన్నిస్ ధ్రువీకరణ పత్రం అందజేత
- భోగాపురంలో వైభవంగా సాంస్కృతిక వేడుక

**భోగాపురం (జర్నలిస్ట్ ఫైల్) :** భోగాపురంలో నిర్వహించిన సామూహిక థింసా నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. ఒకే వేదికపై 13 వేల మంది గిరిజన కళాకారులు ఏకకాలంలో థింసా నృత్యాన్ని ప్రదర్శించి కొత్త రికార్డు సృష్టించారు. గతంలో 11 వేల మందితో నమోదైన రికార్డును అధిగమిస్తూ ఈ ఘనత సాధించారు. ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం పర్యటన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఈ భారీ ప్రదర్శనను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది.
గిన్నిస్ బుక్ ప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన రిహార్సల్స్ అనంతరం 13 వేల మంది కళాకారులు ఒకేసారి నృత్యం ప్రదర్శించడంతో రికార్డు నమోదైంది. అనంతరం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ప్రతినిధులు అందజేశారు. మిగతా 2లో...

## ఏలూరుకు రిలయన్స్ మెగా ప్రాజెక్టు




- రిలయన్స్ రూ. లక్ష కోట్ల పెట్టుబడి
- చింతలపూడి, రేచెర్ల గనుల్లో దేశంలో తొలి ప్రాజెక్టు
- వేల మందికి ఉపాధి అవకాశాలు

**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఏలూరు జిల్లా చింతలపూడి, రేచెర్ల బొగ్గు గనుల అభివృద్ధికి భారీ ఊతం లభించనుంది. కేంద్ర బొగ్గు శాఖ ఇటీవల నిర్వహించిన ఈ-వేలంలో ఈ రెండు బొగ్గు గనులను రిలయన్స్ సంస్థ దక్కించుకుంది. మిగతా 2లో...

## మొరాకో-స్పెయిన్ సరిహద్దు సంక్షోభం



**స్పెయిన్ :** మొరాకో-స్పెయిన్ సరిహద్దు సంక్షోభం కారణంగా భారీ సంఖ్యలో నిండు ప్రాణాలు బలవుతున్నాయి. గత 24 గంటల్లో మొరాకో దేశం నుంచి దాదాపు 60,000 మంది వలసదారులు ఒకేసారి స్పెయిన్ భూభాగమైన సియుటాలోకి దూసుకురావడానికి ప్రయత్నించారు. సరిహద్దుల్లో ఉన్న కోస్తా తీర రక్షణ కంచెలను బద్దలు కొట్టే క్రమంలో జరిగిన తొక్కిసలాట కారణంగా కొందరు ప్రాణాలు కోల్పోయారు. సముద్రంలో మునిగి మరి కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. మొరాకో-స్పెయిన్ సరిహద్దు సంక్షోభం కారణంగా ఇప్పటివరకు 41 మంది వలసదారులు ప్రాణాలు కోల్పోయారు.
సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులు చెయ్యి దాటిపోతుండటంతో స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ రంగంలోకి దిగారు. స్వయంగా అక్కడి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. మానవ అక్రమ రవాణా ముఠాలు యువకులను తప్పుదోవ పట్టించి మృత్యుముఖంలోకి నెట్టేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. సరిహద్దుల రక్షణ కోసం భారీగా సైన్యం, డ్రోన్లు, స్కూబా డ్రైవర్లు, యుద్ధ నౌకలను రంగంలోకి దించారు. స్పెయిన్ రక్షణ బలగాలు దాదాపు 30,000 మందిని బలవంతంగా తిరిగి మొరాకో సరిహద్దు గేట్ల గుండా వెనక్కి పంపించేశాయి. మిగతా 2లో...

# స్వాగతం మోదీ జీ... సిద్ధమైన ఉత్తరాంధ్ర



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. 'రేపు భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అంటూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు.

ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో ట్రాఫిక్, భద్రత, ప్రజా సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర మణిహారమని, విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్రకు పెట్టుబడులు వస్తాయని కూటమి నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని రాక సందర్భంగా 7 వేల మంది పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేశారు.

## ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్‌కు స్వాగతం పలికిన మంత్రి లోకేష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ లు స్వాగతం పలికారు. రాష్ట్ర పర్యటన నిమిత్తం శుక్రవారం రాత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆస్ట్రేలియా ప్రభుత్వ అంతర్జాతీయ విద్య, పౌరసత్వం, కస్టమ్స్, బహుళ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జూలియన్ హిల్ కు పుష్పగుచ్ఛం అందించి మంత్రి సాదర స్వాగతం పలికారు. రాష్ట్రానికి విచ్చేసిన జూలియన్ హిల్ ను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. శనివారం మంత్రి నారా లోకేష్ సమక్షంలో యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్, రాష్ట్ర విద్యాశాఖ మధ్య పలు అవగాహన

## భోగాపురం ఫ్లైట్ షెడ్యూల్ విడుదల

**భోగాపురం (జర్నలిస్ట్ ఫైల్) :** భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముస్తాబయింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతులమీదుగా శనివారం ఉదయం ఈ ఎయిర్ పోర్టు వైభవంగా ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఎయిరిండియా సంస్థ భోగాపురం ఎయిర్ పోర్టుకు ఫ్లైట్ షెడ్యూల్ ను విడుదల చేసింది. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 24వ తేదీ వరకూ ఫ్లైట్ షెడ్యూల్ ను ప్రకటించింది. హైదరాబాద్ – భోగాపురం మధ్య ప్రతిరోజూ 5 విమాన సర్వీసుల్ని నడపనున్నట్లు ఎయిర్ ఇండియా పేర్కొంది. అలాగే వారంలో ఆదివారం, శుక్రవారం మినహా.. మిగతా ఐదురోజుల్లో బెంగళూరు – భోగాపురం మధ్య ఒక ఫ్లైట్, విజయవాడ – భోగాపురం మధ్య ప్రతిరోజూ 4 సర్వీసులు నడపనున్నట్లు వివరించింది. కాగా.. రూ. 5,640 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అని పేరుపెట్టారు.

## శ్రీశైలం జలాశయానికి వరద..

(మొదటి పేజీ తరువాయి)

జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 830.70 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 50.26 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఒకటిన్నర రోజు వ్యవధిలోనే డ్యామ్ లోకి 4.67 టీఎంసీల నీరు వచ్చి చేరడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూరాల పవర్ హౌస్ నుంచి 38,225 క్యూసెక్కులు, స్పిల్ వే గేట్ల ద్వారా రూ. 47,196 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. మరో మూడ్రోజులపాటు ఇదేస్థాయిలో వరద ప్రవాహం కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా 25 టీఎంసీల నీరు చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు వరద తాకిడి పెరుగుతోంది. మూడురోజులుగా ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి కృష్ణానదీ జలాలు దిగువకు విడుదల కావడంతో జూరాల జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.657 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## 19 వర్సిటీల పాలక మండళ్ల రద్దు

(మొదటి పేజీ తరువాయి)

అయితే పదవీ రీత్యా కొనసాగుతున్న సభ్యులకు ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది.

క్లాజ్–1 కింద ఉన్న ఎక్స్–ఆఫిషియో సభ్యులు యథావిధిగా కొనసాగుతారని ప్రభుత్వం పేర్కొంది. విశ్వవిద్యాలయాల పాలక మండళ్ల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ)కు కొత్త పాలక మండలిని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాల్లో కూడా కొత్త పాలక మండళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

# రెక్కలు విప్పిన ఉత్తరాంధ్ర

(మొదటి పేజీ తరువాయి)



అధికారులు వివరించారు. అలాగే విమానాశ్రయంలో దేశంలోనే అతిపెద్ద ఎల్ఈడీ డిస్ప్లే వాల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విమానాల రాకపోకలు, సర్వీసుల వివరాలు తెలియచేసేలా ప్రయాణికుల కోసం ఎల్ఈడీ వాల్ ను ఏర్పాటు చేసినట్టు సీఎంకు వివరించారు.

**ప్రధానికి గిరిజన థింసా నృత్యంతో ఘన స్వాగతం :** ఉదయం 10.45 గంటలకు ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్న ప్రధాని నరేంద్ర మోదీకి... రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తదితరులు స్వాగతం పలకనున్నారు. అనంతరం 10.58 గంటలకు ప్రధాని ఎయిర్ పోర్టు టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తారు. దాదాపు 12 నిముషాల పాటు టెర్మినల్ భవనంలో గడపనున్నారు. విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన తెలుగు కళాకృతులు, సంస్కృతీ వారసత్వ వైభవాన్ని చాటి చెప్పేలా ఏర్పాటు చేసిన చిత్రాలను ప్రధాని తిలకించనున్నారు. టెర్మినల్ భవనం నుంచి బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకునే సమయంలో ప్రధాని మోదీకి గిరిజన సంప్రదాయ నృత్యం థింసాతో మహిళలు, బాలికలు ఘన స్వాగతం పలకనున్నారు. ఏక రూప దుస్తులు ధరించిన గిరిజన మహిళలు, బాలికలు థింసా నృత్యంతో ప్రధానికి, ఇతర అతిథులకు విశిష్టమైన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం బహిరంగ సభా వేదిక ప్రాంగణానికి చేరుకోనున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్ సహా ఇతర ప్రజాప్రతినిధులు, సీఎస్ సాయి ప్రసాద్, ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# సూర్య సరోవర్ యోజనకు రూ.5070 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)



5,000 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను నిర్మిస్తారు. జలాశయాలను వినియోగించుకోవడం వల్ల భూసేకరణ అవసరం తగ్గడమే కాకుండా, ఏటా సుమారు 10 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి. విజయవంతమైన ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ. 1 కోటి చొప్పున 'సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్' లభిస్తుంది.

**సముద్ర మంథన్ కు ఆమోదం :** దేశీయ చమురు, సహజవాయువు ఉత్పత్తులను పెంచి ఇంధన భద్రతను పటిష్టం చేసేందుకు రూ. 84,084 కోట్లతో 'సముద్ర మంథన్' (జాతీయ ఆఫ్‌షోర్ అన్వేషణ) పథకానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2030–31 వరకు అమలయ్యే ఈ పథకం ద్వారా డీప్‌వాటర్, అల్ట్రా–డీప్‌వాటర్ సముద్ర జలాల్లో శాస్త్రీయ డ్రిల్లింగ్, సీస్మిక్ డేటా సేకరణ చేపడతారు. దీనిద్వారా సముద్ర తీరాల్లో సుమారు 600 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆయిల్ ఈక్వివలెంట్ చమురు నిల్వలను వెలికితీసి, మేక్ ఇన్ ఇండియా కింద స్వదేశీ పరిజ్ఞానానికి బాటలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**PM-కిసాన్ ఐదేళ్లు పొడిగింపు :** దేశంలోని రైతుల ఆర్థిక స్థిరత్వం కోసం 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకాన్ని 2026–27 నుండి 2030–31 వరకు మరో ఐదేళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీనికోసం రూ. 3.15 లక్షల కోట్ల భారీ నిధులను కేటాయించారు. ఇప్పటివరకు 23 వాయిదాలలో రూ. 4.47 లక్షల కోట్లకు పైగా నిధులు డీబీటీ (ఐదీ) ద్వారా రైతుల ఖాతాల్లో జమకాగా, నీతి ఆయోగ్ అధ్యయనం ప్రకారం 92% మంది రైతులు ఈ సాయాన్ని విత్తనాలు, ఎరువులు, సాగు పెట్టుబడులకే ఉపయోగిస్తున్నారని వెల్లడైంది.

భారత్‌ను అంతర్జాతీయ క్రీడా శక్త్యాలయంగా మార్చేందుకు పొడిగించిన 'ఖేలో ఇండియా' పథకంతో పాటు 'నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్లకు ఆర్థిక సహాయం' నిర్ణయానికి ఆమోదం లభించింది. 2026–27 నుండి 2030–31 కాలానికి గాను రూ. 36,441 కోట్లను కేటాయించారు. పాఠశాల స్థాయి నుండి ప్రతిభను గుర్తించేందుకు 'ఖేలో ఇండియా ఫీడర్ స్కూల్స్', KIUV ప్రారంభించడంతో పాటు, క్రీడాకారులకు అంతర్జాతీయ శిక్షణ, సైంటిఫిక్ సపోర్ట్ అందించేందుకు నేషనల్ కోచ్ అక్రిడిటేషన్ బోర్డుని ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది.

# మొరాకో-స్పెయిన్ సరిహద్దు సంక్షోభం..

(మొదటి పేజీ తరువాయి)



**స్యూటా ప్రత్యేకత ఏంటి?** ఉత్తర ఆఫ్రికాలోని మొరాకో తీరానికి ఆనుకుని ఉన్న స్పెయిన్‌కు చెందిన చిన్న స్వయం ప్రతిపత్తి ప్రాంతమే స్యూటా. భౌగోళికంగా ఆఫ్రికాలో ఉన్నా.. రాజకీయంగా స్పెయిన్‌లో భాగం. అందువల్ల ఇది యూరోపియన్ యూనియన్ భూభాగమే. యూరప్‌లోకి వెళ్లాలనుకునే వలసదారులకు ఇది అత్యంత దగ్గరి మార్గం.

**ఇప్పుడు ఏం జరిగింది? :** ఈసారి పరిస్థితి గతంతో పోలిస్తే మరింత తీవ్రంగా మారింది. ఒక్కరోజులోనే 60 వేల మందికిపైగా స్యూటాలోకి ప్రవేశించినట్లు స్పెయిన్ తెలిపింది. శరణార్థుల కేంద్రాలు నిండిపోయాయి. స్థానిక పోలీసులు పరిస్థితిని అదుపు చేయలేని స్థితి ఏర్పడింది. దీంతో సైన్యం, నౌకాదళం, వైమానిక దళాన్ని రంగంలోకి దించి సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేశారు.

**ప్రాణాలకు తెగించి మరీ.. :** స్యూటాకు చేరే మార్గం అత్యంత ప్రమాదకరం. మొరాకో తీరం నుంచి సముద్రంలో ఈదుకుంటూ సరిహద్దు దాటాల్సి వస్తుంది. బలమైన అలలు, సముద్ర ప్రవాహాలు, సరిహద్దు అడ్డంకులు ఈ ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. ఈసారి కూడా కనీసం 18 మంది మృతి చెందారు. ఎక్కువ మంది మునిగిపోయారు. మరెందరో నీటిలో చిక్కుకోగా సహాయక బృందాలు కాపాడాయి.

**ఒక్కసారిగా ఎందుకు పెరిగింది? :** తాజా సంక్షోభానికి ఒక కీలక పరిణామం కారణమైందని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల స్పెయిన్ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. సముద్ర మార్గంలో స్యూటా లేదా మెలిల్లాకు చేరిన వలసదారులను వెంటనే మొరాకోకు వెనక్కి పంపకూడదు. వారి పరిస్థితిని పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. దీంతో చట్టబద్ధంగా ఉండేందుకు అవకాశం కల్పిస్తారనే వదంతులు వ్యాపించడంతో ఒక్కసారిగా వలసలు పెరిగాయి.

**పాత వివాదమే మరో కారణమా? :** స్యూటాపై స్పెయిన్, మొరాకో మధ్య వివాదం కొత్తది కాదు. 1580 నుంచి ఈ ప్రాంతం స్పెయిన్ అధీనంలో ఉంది. అయితే మొరాకో ఇప్పటికీ దీనిని తన భూభాగంగానే పరిగణిస్తోంది. 2021లో కూడా మొరాకో సరిహద్దు నియంత్రణలను సడలించడంతో రెండు రోజుల్లో సుమారు 8 వేల మంది స్యూటాలోకి ప్రవేశించారు. అప్పట్లో రెండు దేశాల మధ్య దౌత్య ఉద్రిక్తతలు కూడా నెలకొన్నాయి.

**యూరప్‌కూ సవాల్ :** యూరోపియన్ యూనియన్‌కు స్యూటా భూసరిహద్దు. అందుకే అక్కడ జరిగే ప్రతి పరిణామం యూరప్ మొత్తంపై ప్రభావం చూపుతుంది. అక్రమ వలసలు పెరిగితే భద్రత, ఆశ్రయ విధానాలు, సరిహద్దు నిర్వహణపై ఒత్తిడి పెరుగుతుంది. ఇప్పటికే ఇటలీ కఠిన చర్యలు అవసరమని సూచించింది. మరోవైపు యూరోపియన్ యూనియన్ సరిహద్దు భద్రతా సంస్థ ఫ్రాంటెక్స్ కూడా సహకారం అందించేందుకు సిద్ధమైంది.

**ముందున్న సవాళ్లు :** సరిహద్దు వద్ద సైన్యాన్ని మోహరించడం తాత్కాలిక పరిష్కారమే. పేదరికం, నిరుద్యోగం, రాజకీయ అస్థిరత, యుద్ధాలు, మానవ అక్రమ రవాణా వంటి మూల సమస్యలు కొనసాగినంత కాలం వలసల ప్రవాహం ఆగడం కష్టమేనని నిపుణులు చెబుతున్నారు.

# ఆగస్టు 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంస్కృత సప్తాహం

- **గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా సాహితీవేత్తలకు పురస్కారాలు: తెలుగు, సంస్కృత అకాడమీ**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** సంస్కృత భాషను పండితులకే పరిమితం కాకుండా సామాన్య ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25 నుంచి 31 వరకు సంస్కృత సప్తాహం నిర్వహించనున్నట్లు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర) తెలిపారు. వడ్డేశ్వరంలోని అకాడమీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

సంస్కృత అకాడమీ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఏ ప్రభుత్వం కూడా తగిన నిధులు కేటాయించలేదని, భాషాభివృద్ధికి ఆర్థిక సహకారం అత్యవసరమని పేర్కొన్నారు. అకాడమీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ ఇటీవల ఢిల్లీలో కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయం, భారతీయ భాషా సమితి, కేంద్ర విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.

సంస్కృత సప్తాహం సందర్భంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కొవ్వూరు, తణుకు, గుంటూరు, జిల్లెళ్లమూడి, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు, గుడివాడ, విజయవాడ తదితర ప్రాంతాల్లో వివిధ విద్యాసంస్థలు, సంస్కృత కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు భారతం, భాగవతం తదితర అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించడంతో పాటు సంస్కృత భాషాభివృద్ధికి విశేష సేవలు అందించిన పండితులను సన్మానించనున్నట్లు చెప్పారు.

ఆగస్టు 29న గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాష, సంస్కృతికి విశేష కృషి చేసిన సాహితీవేత్తలకు అకాడమీ ఆధ్వర్యంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం అకాడమీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విలేకరుల సమావేశంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరమ్మ, డాక్టర్ ఎస్.ఏ.టి. రాజ్యలక్ష్మి, డాక్టర్ పి. కోటి రత్నం, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ పి.టి.జి.వి. రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## థింసాతో ప్రపంచ రికార్డు




(మొదటి పేజీ తరువాయి)

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరు, పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థినులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 275 బాక్సలలో ఒక్కో బాక్సలో 50 మంది చొప్పున కళాకారులు నిలిచి, 64 మంది శిక్షకుల పర్యవేక్షణలో మూడు రోజుల పాటు సామూహిక సాధన నిర్వహించారు.

ప్రధాని మోదీకి గిరిజన సంప్రదాయంతో స్వాగతం పలికేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా థింసా నృత్యానికి అంతర్జాతీయ గుర్తింపు లభించిందని అధికారులు తెలిపారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే ఈ ప్రదర్శన రాష్ట్రానికి మరో ప్రతిష్ఠాత్మక ఘట్టంగా నిలిచిందన్నారు.

## ఏలూరుకు రిలయన్స్ మెగా ప్రాజెక్టు



(మొదటి పేజీ తరువాయి)

సుమారు రూ. లక్ష కోట్ల పెట్టుబడితో దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్ (అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్) ప్రాజెక్టును ఇక్కడ ఏర్పాటు చేయాలని సంస్థ నిర్ణయించింది. ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధితో పాటు ప్రత్యక్ష, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఇటీవల రిలయన్స్ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై ప్రాజెక్టు రూపకల్పన, అమలు కార్యాచరణపై వివరాలు వెల్లడించినట్లు సమాచారం. 2029 నాటికి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతోంది.

చింతలపూడి, రేచెర్ల బ్లాకుల్లో భూమి ఉపరితలం నుంచి 600 మీటర్లకు పైగా లోతులో భారీ బొగ్గు నిల్వలు ఉన్నందున సంప్రదాయ తవ్వకాలకు బదులుగా భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్ సాంకేతికతను వినియోగించనున్నారు. ఈ విధానంలో బొగ్గును భూమిలోనే వాయువుగా మార్చి పైకి తీసుకువచ్చి పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తారు. దేశంలో ఈ తరహా ప్రాజెక్టు తొలిసారిగా అమలు కానుండటం విశేషం.

చింతలపూడి బ్లాక్‌లో 1,200 హెక్టార్ల విస్తీర్ణంలో 904.94 మిలియన్ టన్నుల 'జీ–12' రకం బొగ్గు నిల్వలు ఉండగా, రేచెర్ల బ్లాక్‌లో 2,225 హెక్టార్లలో 2,225.67 మిలియన్ టన్నుల 'జీ–13' రకం బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు అంచనా. రెండు గనుల్లో కలిపి మొత్తం 3,130.61 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియలో బొగ్గును నియంత్రిత పరిస్థితుల్లో వాయువుగా మార్చి 'సిన్‌గ్యాస్'ను ఉత్పత్తి చేస్తారు. ఈ వాయువును ఉపయోగించి అమ్మోనియా, అమ్మోనియం నైట్రేట్ వంటి పారిశ్రామిక రసాయనాలను తయారు చేసే అవకాశం ఉంటుంది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు దేశీయ పారిశ్రామిక రంగానికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ముసాయిదా ఓటరు జాబితా విడుదల



(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరిశీలనలో 15.22 లక్షల మంది ఓటర్లు మృతి చెందినట్లు, 22.30 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు గుర్తించినట్లు సీఈవో తెలిపారు. మరో 7.37 లక్షల మంది పేర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనట్లు గుర్తించి, ఆయా పేర్లను ఒకే నియోజకవర్గంలో కొనసాగించే చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని, అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు.

ముసాయిదా జాబితాపై జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు. జాబితాలో పేరు లేకపోయినా లేదా వివరాల్లో పొరపాట్లు ఉన్నా ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను పరిశీలించి విచారణ అనంతరం అక్టోబర్ 3న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు.

అర్హులైన వారి పేర్లను తుది జాబితాలో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం విచారణ అనంతరమే జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఎలాంటి నోటీసు, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును కూడా తొలగించబోమని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను ఈసీఐ నెట్ యాప్, సీఈవో వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని సూచించారు.

అయితే ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించిన వారిలో కొందరు 2002 ఓటరు జాబితాతో తమ వివరాలను లేదా కుటుంబ సభ్యుల వివరాలను మ్యాపింగ్ చేయలేదని అధికారులు గుర్తించారు. అలాంటి వారికి ప్రత్యేక నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. వారు ఆధార్ కార్డు కాకుండా ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

# భోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త అధ్యాయం

- ప్రధాని చేతుల మీదుగా నేడు ప్రారంభం.. ప్రాంత ఆర్థిక ప్రగతికి గేమ్‌చేంజర్
- మంత్రి అచ్చెన్నాయుడు



**భోగాపురం, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్):** ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో మరో కీలక మైలురాయిగా నిలిచే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు నూతన ఊపునివ్వడంతో పాటు ప్రాంతాభివృద్ధికి ప్రధాన కేంద్రంగా అవతరిస్తుందని పేర్కొన్నారు.

శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ, సుమారు 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్ల వ్యయంతో, 3,800 మీటర్ల రన్‌వేతో నిర్మించిన ఈ విమానాశ్రయం రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక ఆస్తిగా నిలవనుందని చెప్పారు. రాష్ట్ర విభజన అనంతరం ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. అప్పటి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు చొరవతో కేంద్ర అనుమతులు సాధించడంతో పాటు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైందని తెలిపారు.

తదనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2023లో రెండోసారి శంకుస్థాపన చేసినప్పటికీ, నిర్మాణ పనులు ఆశించిన వేగంతో ముందుకు సాగలేదని అచ్చెన్నాయుడు విమర్శించారు. ప్రాజెక్టు విస్తీర్ణాన్ని తగ్గించే ప్రయత్నాలు, పనులపై తగిన శ్రద్ధ లేకపోవడం వల్ల నిర్మాణం ఆలస్యమైందని పేర్కొన్నారు.

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులు వేగం పుంజుకున్నాయని మంత్రి తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నిరంతర పర్యవేక్షణ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ, అనుసంధాన రహదారుల అభివృద్ధి చర్యలతో అన్ని అడ్డంకులు తొలగి తక్కువ కాలంలోనే విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమైందని చెప్పారు.

ఆగస్టు 17 నుంచి సింగపూర్‌కు తొలి అంతర్జాతీయ విమాన సర్వీస్ ప్రారంభం కానుండగా, త్వరలోనే మరిన్ని అంతర్జాతీయ విమానయాన సంస్థలు కూడా తమ సేవలను ప్రారంభించనున్నాయని వెల్లడించారు. ప్రయాణికుల రాకపోకలతో పాటు కార్గో సేవలకు కూడా అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

భోగాపురం విమానాశ్రయం ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, ఉద్దానం ప్రాంతాల వ్యవసాయ, ఉద్యాన, మత్స్య ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లతో ప్రత్యక్ష అనుసంధానం ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు. విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు, లాజిస్టిక్స్ పార్కులు, సేవారంగ సంస్థలు ఏర్పడి వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రను దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్ది ప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తుందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు..

## ఆర్టీసీ ప్రైవేటీకరణకు తావులేదు



- ప్రభుత్వ బస్సులు, కార్మికులే సంస్థకు బలం
- మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**విజయనగరం, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఆర్టీసీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించే ఆలోచన లేదని, ప్రభుత్వ బస్సులు, కార్మికులే సంస్థకు అసలైన బలమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం విజయనగరం ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌ను సందర్శించిన మంత్రి వివిధ విభాగాల పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

వర్క్‌షాప్‌లోని ఎఫ్ఐపీ, ఇంజిన్, మెషిన్ షాప్, ఎలక్ట్రికల్, బాడీ షాప్, యూనిట్‌లను పరిశీలించిన మంత్రి బస్సుల నిర్వహణ, మరమ్మతుల నాణ్యత, సాంకేతిక ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు సురక్షితమైన, నాణ్యమైన సేవలు అందేలా నిర్వహణలో రాజీ పడకుండా పనిచేయాలని సూచించారు. వర్క్‌షాప్ కార్యకలాపాలపై వర్క్స్ మేనేజర్ వరుణ్ కుమార్, అధికారి అరుణ, రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు మంత్రికి వివరాలు అందించారు.

అనంతరం ఆర్టీసీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, కార్మికులు, ప్రయాణికులు సంస్థకు రెండు కళ్లలాంటి వారని అన్నారు. ప్రభుత్వ బస్సులు, కార్మికుల సహకారంతోనే ఆర్టీసీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని, ప్రైవేటీకరణకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు.

## అంబటి రాంబాబుపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ



- జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కించపరిచేలా, ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర వీడియో పోస్టు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడిన పిల్లి మాణిక్యరావు, రాజకీయాల్లో ప్రజా సమస్యలపై పోరాడితేనే నాయకత్వానికి గుర్తింపు వస్తుందని, వ్యక్తిగత దూషణలు, అభ్యంతరకర వీడియోలతో రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌పై సామాజిక మాధ్యమాల్లో సంకెళ్లు వేసినట్లు చూపిస్తూ వీడియో రూపొందించి ప్రచారం చేయడం తీవ్ర అభ్యంతరకరమని ఆరోపించారు.

అంబటి రాంబాబు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయంలో ఇలాంటి పోస్టులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని, చట్టప్రకారం కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రావిపాటి సాయికృష్ణ, న్యాయవాదులు శ్రీరామ్, రాజీవ్ ఆనంద్, కట్టా కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## జువైనైల్ జస్టిస్ చట్ట సవరణలపై సూచనలు ఆహ్వానం

- ఆగస్టు 7లోగా రాష్ట్ర కమిషన్‌కు ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి

**అమరావతి, జూలై 31(జర్నలిస్ట్ ఫైల్):** జువైనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్-2015కు ప్రతిపాదిత సవరణలపై సూచనలు, అభిప్రాయాలను కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆహ్వానిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఎ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు తెలిపారు.

బాలల సంరక్షణ, రక్షణ, పునరావాసానికి సంబంధించిన చట్టపరమైన నిబంధనలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జువైనైల్ జస్టిస్ చట్టం--2015ను సమీక్షిస్తున్న నేపథ్యంలో అవసరమైన సవరణలు, కొత్త ప్రతిపాదనలపై సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలు కోరుతున్నట్లు వెల్లడించారు.

సంబంధిత ప్రభుత్వ శాఖలు, సంస్థలు, భాగస్వామ్య సంస్థలు, బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు, ప్రజలు నిర్ణీత నమూనాలో తమ సూచనలు, సలహాలను సమర్పించాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిపాదనలను ఆగస్టు 7లోగా apscpcr2018@gmail.comకు పంపాలని సూచించారు.

అదే విధంగా సూచనలను ఆగస్టు 14, 2026లోగా cw2section-mwcd@gov.in ఈ-మెయిల్ ద్వారా కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు నేరుగా కూడా పంపవచ్చని చైర్‌పర్సన్ తెలిపారు.

## సెల్‌ఫోన్ చూస్తూ బస్సు నడిపిన డ్రైవర్‌పై వేటు

- ప్రయాణికుడి వీడియోతో వెలుగులోకి ఘటన.. మంత్రి ఆదేశాలతో విధుల నుంచి తొలగింపు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** అన్నమయ్య జిల్లాలో ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేలా సెల్‌ఫోన్ చూస్తూ బస్సు నడిపిన ఆర్టీసీ డ్రైవర్‌పై అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. పాలమనేరు డిపోకు చెందిన ఏపీ39 యూవై 9691 హైర్ సర్వీస్ బస్సు డ్రైవర్ విధి నిర్వహణలో ఉండగానే సెల్‌ఫోన్ వినియోగిస్తున్న దృశ్యాలను ఓ ప్రయాణికుడు వీడియో తీసి సంబంధిత అధికారులకు పంపడంతో ఘటన వెలుగులోకి వచ్చింది.

వీడియోను పరిశీలించిన రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెంటనే స్పందించి, సంబంధిత డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఆర్టీసీ యాజమాన్యం డ్రైవర్‌ను వెంటనే విధుల నుంచి ఉపసంహరించింది.

## ప్రజల వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు



**అమృతలూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'మీకోసం (PGRS) – ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం'లో భాగంగా వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు అమృతలూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్ల నేపథ్యంలో సాధారణంగా ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఈ వారం మంగళవారం నిర్వహించారు.

అమృతలూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, ఆదాయ ధ్రువపత్రాలు, పింఛన్లు, గృహ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ప్రతి వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యలను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందించడం, వారి సమస్యలకు పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నక్కా ఆనంద బాబు పేర్కొన్నారు. ప్రతి అర్జీపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి నిర్ణీత గడువులోపు పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయానికి కర్టెన్ రైజర్..

- ఋషికొండలో వైభవంగా వేడుకలు
- భోగాపురం విమానాశ్రయం భవిష్యత్తుకు చుక్కాని...
- మంత్రి కందుల దుర్గేష్



**విశాఖపట్నం, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముందస్తు వేడుకల్లో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది పలుకుతుందని మంత్రి పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పర్యాటక రంగం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల విస్తరణకు మెరుగైన కనెక్టివిటీ అత్యంత కీలకమని అన్నారు. రోడ్డు, రైలు, విమాన, జల మార్గాల అనుసంధానంతో పెట్టుబడులు పెరిగి లక్షలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రజల కలలను సాకారం చేసే ప్రాజెక్టుగా నిలుస్తుందని, ఈ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశను చూపుతుందని చెప్పారు.

కార్యక్రమంలో ఏర్పాటు చేసిన భోగాపురం విమానాశ్రయ నమూనాతో రూపొందించిన సైకత శిల్పాలు, "థ్యాంక్స్ ఫార్మర్స్" సందేశం, సాంస్కృతిక ప్రదర్శనలు, సెల్ఫీ పాయింట్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అన్నమాచార్య ట్రస్ట్ చిన్నారుల నృత్య ప్రదర్శనలు, గిరిజన కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మంత్రి సెల్ఫీ పాయింట్‌ను సందర్శించి సిగ్నేచర్ వాల్‌పై తెలుగులో సంతకం చేశారు.

ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్ పరిశుభ్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో బీచ్ అందాన్ని దెబ్బతీయొద్దని, బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు కొనసాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. బీచ్ పరిసరాల్లో జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారుల ప్రయోజనాలను ప్రభుత్వం పరిరక్షిస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పర్యాటక రంగ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పర్యాటకులు పాల్గొన్నారు.

## కళను కాపాడే కళ్లకు ఆరోగ్య భరోసా

- పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అత్తిలిలో లేస్, నేత కళాకారులకు ఉచిత కంటి పరీక్షలు
- 15 మందికి త్వరలోనే క్యాటరాక్ట్ శస్త్రచికిత్స



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** హస్తకళాకారుల చేతుల్లో కళ బతకాలంటే... వారి కళ్లల్లో వెలుగులు చిరకాలం నిలవాలన్న సంకల్పంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ హస్త కళాకారుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం వేదికగా కళాకారులకు ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకొస్తూ ఇప్పటి వరకు కొండపల్లి, నరసాపురం, పాలకొల్లు, బొబ్బిలి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. కళాకారుల ఆరోగ్యమే వారి కళకు బలమనే భావనతో నిరంతరం ఆరోగ్య సేవలను అందిస్తున్నారు. కంటి పరీక్షల నుంచి అవసరమైన మందులు, కళ్లద్దాలు, శస్త్రచికిత్సల వరకు పూర్తిస్థాయి వైద్య సహాయాన్ని ఉచితంగా అందిస్తూ హస్తకళాకారుల జీవితాల్లో ఆరోగ్య భరోసా నింపుతున్నారు. ఇందులో భాగంగా గురువారం పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో ఆ ప్రాంత లేస్, నేత కళాకారుల కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో మొత్తం 143 మంది కళాకారులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 15 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వారికి త్వరలోనే ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 110 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించగా, వారికి ఉచితంగా కళ్లద్దాలను అందించనున్నారు. మరో 18 మంది కళాకారులకు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు.

## బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు!



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** మండల గ్రామమైన చినరావూరులోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానంలో ఆషాడమాసం పుష్కరించుకుని శుక్రవారం ఆలయ ఈవో హరిప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గూడూరు ఈశ్వర భరద్వాజ్, పండితులు మహంకాళి శ్రీనివాస శాస్త్రి ల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అన్నాభిషేక కార్యక్రమం, అమ్మవారికి శాఖంబరి అలంకార ఉత్సవం ఘనంగా నిర్వహించారు. చినరావూరు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సుమారు 1500 మంది భక్తులకు విశేష అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈ.వో హరిప్రసాద్ మాట్లాడుతూ ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి శాకంబరీ అలంకారం చేయటం జరిగిందని పేర్కొన్నారు . ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో విలసిల్లాలని సంకల్పంతో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించటం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో చినరావూరు గ్రామ పెద్దలు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వేతనాల పెంపు కోసం కలెక్టరేట్ల ముట్టడి విజయవంతం: సీఐటీయూ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా 27 జిల్లా కలెక్టరేట్ల వద్ద వేతనాల పెంపు, సామాజిక భద్రతా సౌకర్యాల అమలు తదితర డిమాండ్లతో నిర్వహించిన ఆందోళనలను విజయవంతం చేసిన స్కీం వర్కర్లకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, వీఓఏలు, ఆర్పీలు, స్కూల్ స్వీపర్లు, సమగ్ర శిక్ష, జాతీయ ఆరోగ్య మిషన్, ఉపాధి హామీ, వెలుగు తదితర పథకాల సిబ్బందికి నెలకు రూ.26 వేల కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు అమలు చేయాలని డిమాండ్ చేసింది. అలాగే అంగన్‌వాడీలకు నవచేతన యాప్ రద్దు, ఆశా వర్కర్ల పనిభారం తగ్గింపు, స్మార్ట్ కిచెన్ల ఉపసంహరణ, పెండింగ్ వేతనాల చెల్లింపు వంటి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరింది.

ఆందోళనలను అణచివేసేందుకు ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి శాంతియుతంగా నిరసన తెలిపిన స్కీం వర్కర్లు, సీఐటీయూ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం, లాఠీచార్జ్‌కు పాల్పడడం ఖండనీయమని సీఐటీయూ పేర్కొంది. అనకాపల్లిలో లాఠీచార్జ్‌లో వీఓఏ రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవికి ఫ్రాక్చర్ కాగా, మరికొందరు గాయపడ్డారని తెలిపింది. కృష్ణ, శ్రీకాకుళం, పల్నాడు, పార్వతీపురం, ఏలూరు తదితర జిల్లాల్లో తోపులాటలు, అరెస్టులు చోటుచేసుకున్నాయని వెల్లడించింది.

ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కోనసీమ, మార్కాపురం, కడప, కర్నూలు, విశాఖ, కాకినాడ, అనంతపురం, నంద్యాల తదితర జిల్లాల్లో సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు ఆందోళనల్లో పాల్గొని ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు.

డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఉద్యమాలకు సిద్ధమవుతామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్. నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఏ.వి. నాగేశ్వరరావు హెచ్చరించారు.

## సహకార శాఖలో ఒకే రోజు ముగ్గురు అధికారుల ఉద్యోగ విరమణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు సహకార శాఖ కార్యాలయంలో సేవలందిస్తున్న ముగ్గురు గజిటెడ్ అధికారులు శుక్రవారం పదవీ విరమణ చేసారు. డెప్యూటీ రిజిస్ట్రార్లు సీ. హెచ్. పురుషబాబు, ఎన్. సత్యనారాయణ రెడ్డి అసిస్టెంట్ రిజిస్ట్రార్ హెచ్. ఎం. శర్మ లను డిపార్ట్మెంట్ కు చెందిన పలువురు ఉద్యోగులు పెద్ద ఎత్తున సన్మానించారు. సహకార శాఖ కమిషనర్ ఎ. బాబు ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథి గా వచ్చి, ముగ్గురికి పూలమాలలు వేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్మెంట్ రోజున సన్మానం అనేది సంవత్సరాల సేవకు లభించే ప్రతిఫలమన్నారు. రిటైర్మెంట్ రోజు అనేది వీడ్కోలు చెప్పటానికి కాదని, వారి సేవలను గుర్తించడానికి అన్నారు. రిటైర్మెంట్ రోజున ఆ వ్యక్తిని అభినందించాలని, రిటైర్మెంట్ రోజును సన్మాన దినోత్సవంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ రిజిస్ట్రార్లు శ్రీలక్ష్మి, గౌరీ శంకర్, ఆనంద్ బాబు వందలాది మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రత్యేక వాహనాలలో ఇతర ప్రాంత ఉద్యోగులు సైతం వచ్చి, ముగ్గురు అధికారులను ఘనంగా సన్మానించారు.

## పంచదార్ల తవ్వకాలపై ప్రభుత్వ చర్యలు.. అనకాపల్లి మైన్స్ ఏడీ సస్పెన్షన్

**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** పంచదార్ల కొండలో అక్రమ మైనింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. అనకాపల్లి మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) మజ్జి శ్రీనివాస్‌ను బాధ్యతల నుంచి తొలగిస్తూ సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో అసిస్టెంట్ జియాలజిస్టు పురుషోత్తమ్‌కు ఏడీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పంచదార్లతో పాటు జిల్లాలో అక్రమ క్వారీ అనుమతులపై విచారణ నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకుంది.

ఇదిలా ఉండగా, పంచదార్ల కొండలో అక్రమ తవ్వకాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తవ్వకాల అనుమతులు రద్దు చేయడంతో పాటు పంచదార్లను 'నో మైనింగ్ జోన్'గా ప్రకటించే ప్రక్రియ చేపట్టాలని ఇప్పటికే అధికారులను ఆదేశించారు. పర్యావరణం, పురాతన ఆలయాలు, వారసత్వ సంపదకు నష్టం కలిగించిన సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని, జరిగిన నష్టాన్ని పునరుద్ధరించే బాధ్యత కూడా మైనింగ్ సంస్థదేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సెప్టెంబర్ 1లోపు సీపీఎస్ రద్దు, పాత పెన్షన్, పీఆర్సీపై నిర్ణయం తీసుకోవాలి

- లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదు

: పీఆర్టీయూఎస్ హెచ్చరిక..

**హైదరాబాద్, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన కీలక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాష్ట్రంలోని ప్రముఖ ఉపాధ్యాయ సంఘాల్లో ఒకటైన పీఆర్టీయూఎస్ డిమాండ్ చేసింది. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడం, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం, రెండో పీఆర్సీని ప్రకటించి అమలు చేయడం వంటి మూడు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సెప్టెంబర్ 1, 2026లోపు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, పీఆర్టీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల అమలుపై ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రత, పెన్షన్ హక్కులు, వేతన సవరణకు సంబంధించిన ఈ కీలక అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్ణీత గడువైన సెప్టెంబర్ 1, 2026లోపు ఈ మూడు ప్రధాన సమస్యలను పరిష్కరించకపోతే పీఆర్టీయూఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

**సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి..** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని పీఆర్టీయూఎస్ గుర్తుచేసింది. ప్రభుత్వం ఏర్పడి గణనీయమైన కాలం గడుస్తున్నప్పటికీ, సీపీఎస్ రద్దుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం పట్ల ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొంది. ఉపాధ్యాయులు, ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవన భద్రతకు సంబంధించిన అత్యంత కీలక అంశమైన సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం ఇకనైనా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూఎస్ కోరింది.



**2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలి..** 2003 డీఎస్సీ నియామక ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్ 1, 2004కు ముందే విడుదలైనప్పటికీ, నియామక ప్రక్రియలో జరిగిన జాప్యం కారణంగా పలువురు ఉపాధ్యాయులు కొత్త పెన్షన్ విధానం (సీపీఎస్) పరిధిలోకి వెళ్లారని పీఆర్టీయూఎస్ పేర్కొంది. నోటిఫికేషన్ తేదీని కాకుండా నియామక తేదీని పరిగణనలోకి తీసుకోవడం వల్ల 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానం ప్రయోజనాలను కోల్పోయారని తెలిపింది. ఈ పరిస్థితిలో ఉన్న ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం 57వ మెమో ద్వారా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిందని గుర్తుచేసింది.

అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విడుదలైన 2003 డీఎస్సీ నోటిఫికేషన్ ఆధారంగా నియమితులైన ఉపాధ్యాయులకు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిందని పేర్కొంది. అదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యను సానుకూలంగా పరిగణించి, వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని పీఆర్టీయూఎస్ డిమాండ్ చేసింది. నోటిఫికేషన్ తేదీతోపాటు నియామక ప్రక్రియలో జరిగిన జాప్యాన్ని పరిగణనలోకి తీసుకుని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరింది.

**మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో రెండో పీఆర్సీ..** తెలంగాణ రాష్ట్రంలో రెండో పీఆర్సీని జూలై 1, 2023 నుంచి అమలు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం అక్టోబర్ 2, 2023న పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 5 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) మాత్రమే ప్రకటించిందని పీఆర్టీయూఎస్ పేర్కొంది. పీఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, వేతన సవరణపై ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం పట్ల ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపింది. పీఆర్సీ అమలులో జాప్యం కారణంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రస్తుతం ఆరు డీఏలు బకాయిలుగా ఉన్నాయని పేర్కొంది. పెరుగుతున్న జీవన వ్యయం, నిత్యావసర ధరల భారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించాలని కోరింది. రెండో పీఆర్సీ కమిషన్ నివేదికను వెంటనే ప్రభుత్వం తెప్పించుకుని, ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాలకు అనుగుణంగా పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని పీఆర్టీయూఎస్ డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న డీఏలను కూడా తక్షణమే విడుదల చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆర్థిక ఉపశమనం కల్పించాలని కోరింది.

**గడువులోగా సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం..** సీపీఎస్ విధానం రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు, రెండో పీఆర్సీని ప్రకటించి అమలు చేయడం వంటి మూడు ప్రధాన అంశాలపై ప్రభుత్వం గతంలో హామీలు ఇచ్చినప్పటికీ, వాటి అమలుపై ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని పీఆర్టీయూఎస్ విమర్శించింది.

ఉపాధ్యాయులు, ఉద్యోగుల భవిష్యత్ భద్రత, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఈ కీలక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. సెప్టెంబర్ 1, 2026లోపు మూడు సమస్యలపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని అమలు చర్యలు చేపట్టకపోతే, పీఆర్టీయూఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులు, పెన్షన్ భద్రత, వేతన సవరణ సాధన కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ప్రభుత్వ స్పందనను బట్టి తదుపరి కార్యాచరణను నిర్ణయించి, రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులను ఐక్యం చేసి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని పీఆర్టీయూఎస్ పేర్కొంది.

# భీమేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్..

- స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బిగితే



**హైదరాబాద్, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ .బిగితే పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాష్ట్రంలో సమృద్ధి వర్షాలు కురవాలని, పాడి పంటలు పండాలని ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు.

# నందిగామ గౌడ్ వసతి గృహ నిర్మాణానికి రూ.10 లక్షలు అందజేత..

- చింతా బాలరాజ్ గౌడ్ కుటుంబం ఉదార విరాళం..



**హైదరాబాద్, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** జెర్సీ క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్, దివంగత చింతా బాలరాజ్ గౌడ్ కుటుంబ సభ్యులు నందిగామలో నిర్మిస్తున్న 'గౌడ్ వసతి గృహం' (గౌడ్ హాస్టల్) నిర్మాణ నిమిత్తం రూ. 10,00,000 ఉదారంగా విరాళంగా అందజేశారు. ఈ గొప్ప సహాయానికి గౌడ హాస్టల్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విరాళం అర్హులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో, వారికి మెరుగైన వసతి కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దివంగత బాలరాజ్ గౌడ్ ఆశయాలు, వారి ఉన్నతమైన వారసత్వం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు స్ఫూర్తినివ్వాలని కోరుకున్నారు.. వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని నిర్వాకులు ఆకాంక్షించారు..

# మానవ అక్రమ రవాణా నిరోధనకు సమిష్టి కృషి అవసరం..

: వెల్లండించిన డాక్టర్ సునీత కృష్ణన్..

**హైదరాబాద్, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బి.పి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమీలో "మానవ అక్రమ రవాణా, సురక్షిత వలస అంశంపై ప్రజ్వల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ డా. సునీతా కృష్ణన్ అవగాహన సదస్సులో ప్రసంగించారు. మానవ అక్రమ రవాణా ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న సంఘటిత నేరమని, లైంగిక దోపిడి, బాల కార్మికత్వం, బలవంతపు భిక్షాటనం, అవయవాల అక్రమ రవాణా, సైబర్ మోసాలు, నకిలీ విదేశీ ఉద్యోగాల పేరుతో జరిగే అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా పిల్లలను లక్ష్యంగా చేసుకునే ఆన్‌లైన్ గ్రూమింగ్ వంటి సైబర్ ముప్పులను



వివరించి, బాధితుల రక్షణ, పునరావాసం, సమర్థవంతమైన దర్యాప్తు కోసం సూత్రాలను సమిష్టిగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్ మాట్లాడుతూ పోలీసు యూనిఫామ్‌పై ప్రజలకు అపార విశ్వాసం ఉందని, ప్రతి పోలీసు అధికారి ఆ విశ్వాసాన్ని నిజాయితీ, వృత్తి నైపుణ్యం, మానవీయ దృక్పథంతో నిలబెట్టాలని అన్నారు. మానవ అక్రమ రవాణాను ఆధునిక బానిసత్వంగా అభివర్ణిస్తూ, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించడం, సమన్వయంతో పనిచేయడం, సోషల్ మీడియా వినియోగంలో బాధ్యతతో పాటు వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవడం అత్యంత అవసరమని సూచించారు.

ఈ సందర్భంగా సునీత కృష్ణన్ ను అకాడమీ డైరెక్టర్ జ్ఞాపిక తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ జి. కవిత, అసిస్టెంట్ డైరెక్టర్ వేమా శ్రీనివాసరెడ్డి ఇతర అధికారులు, ప్రొబేషనరీ డి.ఎస్.పి.లు, ఇతర ట్రైనీ అధికారులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లిలో శ్రీ చైతన్య పాఠశాల ఎదుట ఏబీవీపీ ధర్నా

- అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తున్నా పాఠశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్




**శంకర్‌పల్లి, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల ఎదుట అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శంకర్‌పల్లి టౌన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహణ జరుగుతోందని ఆరోపిస్తూ విద్యార్థి నాయకులు ఆందోళన చేపట్టి, వెంటనే సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ, శంకర్‌పల్లిలో గత మూడు సంవత్స రాలుగా పాఠశాల నిర్వహిస్తున్నప్పటికీ అవసరమైన ప్రభుత్వ అనుమతులు, గుర్తింపులు లేకుండానే తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ వద్ద సమాచారం, ఆధారాలు ఉన్నాయని ఆరోపించారు. ఒకవేళ ఈ ఆరోపణలు నిజమైతే విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి విద్యను వ్యాపారంగా మార్చినట్లేనని విమర్శించారు. పాఠశాల వ్యవహారంపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు, ముఖ్యంగా మండల విద్యాధికారి (ఎంఈఓ) దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఏబీవీపీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన పెరుగుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పాఠశాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. విచారణలో నిబంధనల ఉల్లంఘనలు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు విచారణ నివేదికను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు హృషీకేశ్ గౌడ్, చేవ్వ నితిన్, శివకృష్ణ, జైపాల్, సంపత్, అభి, కార్తీక్ పాల్గొన్నారు.

# టూరిజంలో బోట్ల డ్రైవర్లకు సీపీఆర్ పై శిక్షణ..

- హార్ట్ స్ట్రోక్ వస్తే ఏం చేయాలనేదానిపై వివరించిన జీవీఆర్ ఈఎంఆర్ఐ డాక్టర్లు..

**హైదరాబాద్, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** టూరిజం శాఖలోని బోట్ల డ్రైవర్లకు సీపీఆర్ పై శిక్షణ ఇచ్చారు. హైదరాబాద్ లోని లుంబినిపార్కులో బోటింగ్ కార్యాలయంలో గురువారం జీవీఆర్ ఈఎంఆర్ఐ డాక్టర్లు సీపీఆర్ పై అవగాహన కల్పించారు. హార్ట్‌స్ట్రోక్‌కు గురైతే చాలామందికి అది గుండెపోటు అన్న విషయం కూడా తెలియదు. స్పృహ తప్పి పడిపోయారనుకుంటారు. లేదా ఫిట్స్ అనుకొని చేతిలో తాళాలు పెడుతుంటారు.. అలా ఒక్కసారిగా కుప్పకూలితే ముందుగా నాడి కొట్టుకుంటుందో లేదా చూడాలి. పల్స్ లేకపోతే అది స్ట్రోక్‌గా భావించాలి.. అలాగే శ్వాస తీసుకుంటున్నారో లేదో చూడాలి.. ఛాతీపై చెవి పెట్టి గుండె కొట్టుకుంటోందో? లేదో? చూడాలి.. వీటిలో ఏది లేకపోయినా వెంటనే సీపీఆర్ చేయాలని డాక్టర్లు సూచించారు. ఛాతీపై ఒక చేతిపై మరో చేయి వేసి.. రెండు చేతులతో గట్టిగా నొక్కుతూ ఉండాలని, నిమిషానికి కనీసం 30 సార్లు అలా చేయాలని, అలా స్పృహలోకి వచ్చేంతవరకు నొక్కుతూ ఉండాలన్నారు. ఆ తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్లాలని, ఇలా చేయడం వల్ల బ్లడ్ సర్క్యులేషన్ తిరిగి మొదలవుతుందని డాక్టర్లు వివరించారు. ఎక్కువ సేపు బ్లడ్ సర్క్యులేషన్ జరగకపోతే శరీరంలోని కణాలు చనిపోతాయని, ముఖ్యంగా మెదడు, కిడ్నీల్లో ఉండే కణాలు ఆక్సిజన్ అందక చనిపోతాయని, దీంతో ఒక్కోసారి మనిషి బతికినా బ్రెయిన్‌డెడ్ అయ్యే అవకాశాలుంటాయని వివరించారు. సీపీఆర్ కారణంగా గుండెపోటు వచ్చిన వ్యక్తులను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని తెలిపారు. టూరిజం ఎండీ గౌతమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బోటింగ్ డీజీఎం మహేష్ కుమార్, బోట్ల డ్రైవర్లు, టూరిజం సిబ్బంది పాల్గొన్నారు.



# గచ్చిబౌలిలో సెల్లార్ కూలి ముగ్గురు కార్మికులు మట్టిలో చిక్కుకున్నారు

- సహాయక చర్యల్లో సీఎంసీ, హైడ్రా బృందాలు



**శేర్లింగంపల్లి, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనానికి తవ్విన సెల్లార్ ఒక్కసారిగా కూలిపోవడంతో ముగ్గురు కార్మికులు మట్టిలో చిక్కుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే శేర్లింగంపల్లి సీఎంసీ అధికారులు, హైడ్రా బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మట్టిలో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసేందుకు యంత్రాల సహాయంతో సహాయక చర్యలను వేగవంతం చేశారు. పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కార్మికుల ఆరోగ్య పరిస్థితి, సెల్లార్ కూలడానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఘటనపై మరింత సమాచారం రావాల్సి ఉంది.

# వర్షాకాలంలో విద్యుత్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్.ఐ పగడాల శ్రీనివాస్



**గద్వాల, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేటీదొడ్డి ఎస్సై పగడాల శ్రీనివాస్ సూచించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాల సమయంలో విద్యుత్ షాక్‌ల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించడం అత్యంత అవసరమన్నారు. తెగిపోయిన లేదా నేలపై పడిన విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, జంక్షన్ బాక్సుల వద్ద నీరు నిల్వ ఉంటే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకరాదని, పిల్లలను విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇంట్లోని విద్యుత్ వైరింగ్, ఎర్తింగ్ సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకుని, ఏవైనా లోపాలు ఉంటే అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్‌తోనే మరమ్మతులు చేయించాలని సూచించారు. చెట్లు విద్యుత్ తీగలపై పడినా లేదా తీగలు వాలి కనిపించినా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వర్షం, ఉరుములు, మెరుపుల సమయంలో విద్యుత్ స్తంభాలు లేదా చెట్ల కింద నిలబడవద్దని, ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే నేరుగా తాకకుండా ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి సహాయక చర్యలు చేపట్టి వెంటనే 108 అంబులెన్స్, 100 పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై పగడాల శ్రీనివాస్ సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# కరీంనగర్ ప్రజలకు మరింత మెరుగైన రవాణా సేవలు..

- డా. బీ.ఆర్. బాస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసులు ప్రారంభం..
- ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్..

**కరీంనగర్, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** కరీంనగర్ నగర ప్రజలకు మరింత మెరుగైన ప్రజా రవాణా సేవలు అందించడానికి డా.. బీ.ఆర్.బస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసులను ప్రారంభించారు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. అనంతరం కరీంనగర్ బస్ స్టేషన్ నుండి వాగేశ్వరి కాలేజీ వరకు ఆయన ఎమ్మెల్యేలతో కలిసి సిటీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. మొదటి దశలో మూడు రూట్‌లలో అంటే కరీంనగర్ – వాగేశ్వరి కాలేజీ.. కరీంనగర్ – చింతకుంట.. కరీంనగర్ – కొత్తపల్లి హవేలీ సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులను నడుపుతుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరీంనగర్ పట్టణంలో చాలా కాలంగా డిమాండ్ ఉన్న సిటీ బస్సులను ప్రారంభించుకోవడం జరిగింది.. పెరుగుతున్న నగర





అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు ,మహిళలకు ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడతాయి.. ప్రతిరోజు ఉపాధి కొరకు కరీంనగర్ నుండి వచ్చే చింతకుంట , ఒద్యారం, కొత్తపల్లి, విద్యా సంస్థలకు నిలయమైన వాగేశ్వరి వైపు ఈ సిటీ బస్సు సర్వీసులు నడిపించడం జరుగుతుంది.. మెడికల్ కాలేజీలు ఉండే ప్రతిమ, చల్మెడ, మానకొండూరు వైపు కూడా బస్సులు నడుపుతాం.. ప్రయాణికులు ఆదరిస్తే 24 గంటలు బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటాం అన్నారు.. అవసరమైతే ఒకే రూట్ లో అదనపు బస్సులు నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నాం.. నగర ప్రజలంతా సిటీ బస్సులను వాడుకోవాలి.. సిటీ మొత్తం నలుమూలల వైపు బస్సులు నడుస్తున్నాయి.. రాష్ట్రంలో కొత్త రూట్ లలో బస్సులు నడుపుతున్నాం.. మహా లక్ష్మీ ద్వారా మహిళలు ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగించుకుంటున్నారు.. కొత్త బస్సుల కొనుగోలు, కొత్త నియామకాలు చేపట్టాం, వారి పెండింగ్ బకాయిలు తీర్చడం జరిగింది.. ప్రతి గ్రామానికి బస్ చేరాలి.. ఆర్టీసీ ప్రతి రోజు 35 లక్షల కిలోమీటర్లు 65 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు అని తెలియజేశారు మంత్రి పొన్నం..

# యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత కోచింగ్ ను బీసీ యువత సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- అర్హులైన ప్రతి బీసీ అభ్యర్థి గడువులోగా లాంగ్ టర్మ్ కోచింగ్ కు దరఖాస్తు చేసుకోవాలి
- యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత లాగ్ టర్మ్ కోచింగ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :**
ప్రభుత్వం ప్రతిభావంతులైన బీసీ యువతకు కల్పిస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత కోచింగ్ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని, అత్యున్నత సివిల్ సర్వీసుల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు.గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 దీర్ఘకాలిక ఉచిత కోచింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పరిపాలనలో ప్రతిభావంతులైన యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను అందిస్తూ, బీసీ విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన యువత కూడా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు ఈ కోచింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 2026, ఆగస్టు 24 నుంచి 2027, మే నెల వరకు పూర్తిగా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన బోధనతో పాటు, కోచింగ్ సామగ్రి, గ్రంథాలయ సదుపాయం, కరెంట్ అఫైర్స్ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, రెగ్యులర్ పరీక్షలు, మాక్ టెస్టులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అన్ని సౌకర్యాలు ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా కల్పిస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం కోచింగ్ కార్యక్రమానికి మొత్తం 150 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరిలో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా, మరో 50 మందిని ఇప్పటికే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేయనున్నట్లు వివరించారు.ఎంపికైన అభ్యర్థులకు స్టైపెండ్, అదనంగా ఒకేసారి పుస్తకాల గ్రాంట్ అందజేస్తామని అన్నారు. ఈ ఆర్థిక ప్రోత్సాహకాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో పోటీ పరీక్షలపై దృష్టి కేంద్రీకరించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన విద్యార్థులకు కూడా ఈ సమాచారాన్ని చేరవేసేందుకు అధికారులు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని, యువత పట్టుదలతో శ్రమిస్తే అత్యున్నత లక్ష్యాలను తప్పకుండా చేరుకోగలరని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, బీసీ,ఎస్సి, ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 2026 ఆగస్టు 7 వరకు కొనసాగుతుందని, ఆగస్టు 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష, ఆగస్టు 19న ఫలితాలు, ఆగస్టు 21 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆగస్టు 24 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అర్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను టీజీ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి జి. జ్యోతి, డైరెక్టర్ బీసీ స్టడీ సర్కిల్ గోన శ్రీలత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి మాధవి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకట్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, టీజీ బీసీ స్టడీ సర్కిల్ ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏసీఐ వరల్డ్ ఎయిర్పోర్ట్ కస్టమర్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రామ్లో లెవల్-5 అక్రెడిటేషన్ను సాధించిన జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం



**రాజేంద్రనగర్, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :**
జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్),ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎయిర్పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) వరల్డ్ ఎయిర్పోర్ట్ కస్టమర్ ఎక్స్పీరియన్స్ అక్రెడిటేషన్ ప్రోగ్రామ్ కింద అత్యున్నత గుర్తింపైన లెవల్–5 అక్రెడిటేషన్ను సాధించింది.ఈ గుర్తింపుతో,కస్టమర్ అనుభవాన్ని తమ కార్పొరేట్ వ్యూహం,కార్యాచరణలో అత్యుత్తమత,భాగస్వామ్య సహకారానికి కేంద్రబిందువుగా మలిచిన ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక విమానాశ్రయాల సరసన హైదరాబాద్ విమానాశ్రయం నిలిచింది.లెవల్–5 అక్రెడిటేషన్ అనేది పూర్తిస్థాయిలో సమగ్రంగా రూపుదిద్దుకున్న కస్టమర్ అనుభవ వ్యవస్థను కలిగి ఉన్న విమానాశ్రయాలకు అందజేయబడుతుంది.ఇందులో ప్రయాణికుల అంచనాలే వ్యూహాత్మక నిర్ణయాలు,కార్యాచరణలో అత్యుత్తమత,ఆవిష్కరణలు,విమానాశ్రయ పరిసర వ్యవస్థలోని అన్ని భాగస్వామ్య సంస్థల మధ్య సహకారానికి మార్గదర్శకంగా నిలుస్తాయి.ఈ స్థాయిలో కస్టమర్ అనుభవం ఒక ప్రత్యేక కార్యక్రమంగా కాకుండా, విమానాశ్రయ కార్పొరేట్ వ్యూహానికి మూలస్తంభంగా మారి,ప్రయాణికులకు నిరంతరాయమైన,సమర్థవంతమైన,చిరస్మరణీయమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు అన్ని భాగస్వాములు సమిష్టిగా కృషి చేస్తారు.ఈ అక్రెడిటేషన్ ద్వారా,ప్రయాణికుల అవసరాల అవగాహన,వ్యూహాత్మక సమన్వయం,పాలనా విధానం,విమానాశ్రయ సంస్కృతి,విమానాశ్రయ భాగస్వామ్య వ్యవస్థ సహకారం,సేవల రూపకల్పన,ఆవిష్కరణ,కార్యాచరణ మెరుగుదల,పనితీరు కొలమానాలు వంటి కీలక అంశాల్లో,జీహెచ్ఐఏఎల్ అవలంబిస్తున్న సమగ్ర విధానానికి గుర్తింపు లభించింది.ప్రయాణికుల రోజువారీ అనుభవాలతో వ్యూహాత్మక,కార్యాచరణ పనితీరు సూచికలను అనుసంధానించడం ద్వారా ప్రపంచ స్థాయి సేవలను అందించాలనే తన నిబద్ధతను హైదరాబాద్ విమానాశ్రయం మరింత బలోపేతం చేస్తోంది.ఈ సందర్భంగా జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లిమిటెడ్ సీఈఓ కదిర్ కదిర్వన్ మాట్లాడుతూ.."ఏసీఐ వరల్డ్ కస్టమర్ ఎక్సపీరియన్స్ లెవల్–5 అక్రెడిటేషన్ సాధించడం హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిజమైన కస్టమర్ కేంద్రిత ప్రపంచ స్థాయి విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దే మా ప్రయాణంలో ఒక కీలక మైలురాయి.కస్టమర్ అనుభవాన్ని మా కార్పొరేట్ వ్యూహానికి పునాదిగా మలచాలనే మా అచంచల నిబద్ధతకు ఇది నిదర్శనం. ప్రయాణికులకు సులభమైన,సహజమైన,చిరస్మరణీయమైన ప్రయాణ అనుభవాలను అందించేందుకు మా విమానాశ్రయ పరిసర వ్యవస్థలోని అన్ని భాగస్వాములు సమిష్టిగా చేసిన కృషికి ఇది గుర్తింపు.సహకారం,ఆవిష్కరణ,నిరంతర అభివృద్ధి సంస్కృతిని మేము విజయవంతంగా పెంపొందించుకున్నామనే విషయాన్ని ఇది ప్రతిబింబిస్తుంది." అని తెలిపారు."ప్రయాణికుల అంచనాలు నిరంతరం మారుతున్న నేపథ్యంలో,సాంకేతికత,డేటా ఆధారిత విశ్లేషణలు,సేవల ఆవిష్కరణలను వినియోగించి సమర్థవంతమైన,అందరికీ అందుబాటులో ఉండే,వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన మరియు ప్రపంచ ప్రమాణాలకు అనుసరించే సేవలను అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాం.ఈ గుర్తింపు మమ్మల్ని మరింత ఉన్నత ప్రమాణాలను నెలకొల్పేందుకు ప్రేరేపించడమే కాకుండా, ప్రపంచంలోని అగ్రశ్రేణి విమానాశ్రయాల సరసన హైదరాబాద్ విమానాశ్రయం స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది," అని ఆయన పేర్కొన్నారు.ఏసీఐ వరల్డ్ ఎయిర్పోర్ట్ కస్టమర్ ఎక్స్పరియన్స్ అక్రెడిటేషన్ ప్రోగ్రామ్ అంతర్జాతీయ ఉత్తమ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన సమగ్ర మూల్యాంకన విధానం ద్వారా విమానాశ్రయాల కస్టమర్ అనుభవ నిర్వహణ పరిపక్వతను అంచనా వేస్తుంది.ఈ కార్యక్రమంలో అత్యున్నత గుర్తింపైన లెవల్–5 అక్రెడిటేషన్,కస్టమర్ అనుభవాన్ని సంస్థ వ్యూహాత్మక దృష్టి,పాలనా వ్యవస్థ,కార్యాచరణ విధానాలు,సంస్థాగత సంస్కృతిలో పూర్తిస్థాయిలో అంతర్భాగంగా మలిచిన విమానాశ్రయాలకు ప్రదానం చేయబడుతుంది.అలాగే,ఆవిష్కరణలు,డేటా ఆధారిత విశ్లేషణలు మరియు కొలిచే ఫలితాల ఆధారంగా ప్రయాణికుల అనుభవాన్ని నిరంతరం మెరుగుపరచేందుకు అన్ని భాగస్వామ్య సంస్థలు సమిష్టిగా పనిచేసే సమగ్ర విమానాశ్రయ పరిసర వ్యవస్థకు ఇది ప్రతీకగా నిలుస్తుంది.

# మండల స్థాయి సమీక్ష సమావేశం.. గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని సీఈఓ కృష్ణారెడ్డి సూచన




**కేశంపేట, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** కేశంపేట మండలంలో మండల స్థాయి సమీక్ష సమావేశం ఏడీఏ రమాదేవి, మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రంగారెడ్డి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి అధికారి శ్రీ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండలంలోని గౌరవ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో మండలంలోని అన్ని శాఖల ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచులు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, కొత్త పనులు చేపట్టడంతో పాటు సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. దీనిపై విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వర్‌కు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ,,, ప్రతి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. అలాగే 16వ ఆర్థిక సంఘం నిధులు, వీబిజి రాంజీ పథకం విధివిధానాలను వివరించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.మండల ప్రత్యేక అధికారి రమాదేవి మాట్లాడుతూ,,వర్షపాతం తక్కువగా ఉన్న పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడి చేపట్టాలని, నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.సీఈఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. అధికారులు గ్రామాలను తరచూ సందర్శిస్తూ సర్పంచులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఫారం పాండ్లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టి వర్షపు నీటిని భూమిలో నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ దయానంద్, ఎంఈఓ చంద్రశేఖర్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ఆరోగ్య, వ్యవసాయ, పశుసంవర్ధక, ఐసీడీఎస్, అటవీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి అభివృద్ధికి రూ.1,700 కోట్లు : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**తలకొండపల్లి, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్వకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.1,700 కోట్లకు పైగా నిధులను తీసుకువచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.నియోజకవర్గంలోని గ్రామాలను విడతల వారీగా అభివృద్ధి పథంలోకి నడిపిస్తామని ఆయన స్పష్టం చేశారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారావమ్మ అధ్యక్షతన మండల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి మండలంలోని సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గానికి తీసుకొచ్చిన నిధులతో ప్రతి గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. వీటితో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, ప్రజల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.మండలాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, అందరూ కలిసికట్టుగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మండల పరిధిలోని సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి,నిమజ్జనోత్సవాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలి

### :రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

- గణేష్ నిమజ్జనోత్సవాలపై కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జోనల్ స్థాయి సమావేశం



**రాజేంద్రనగర్, (జర్నలిస్ట్ ఫైల్) :** సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే వినాయక చవితి మొదలుకొని సెప్టెంబర్ 25వ తేదీ అనంత చతుర్దశి రోజు వరకు జరిగే వినాయక నిమజ్జనోత్సవాల కు అన్ని ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు టి ప్రకాష్ గౌడ్ అదికారులకు ఆదేశాలు జారీ చేశారు.గురువారం కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గణేష్ నిమజ్జనోత్సవాలపై జరిగిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.వినాయక నిమజ్జనం ఊరేగింపు జరిగే అన్ని రహదారులను బాగు చేయాలన్నారు.నిమజ్జన ఊరేగింపు జరిగే ప్రాంతాలలో అడ్డంగా కరెంటు వైర్లు,చెట్లు ఉంటే వాటిని సరి చేసే విధంగా విద్యుత్,జీహెచ్ఎంసీ అధికారులు చొరవ చూపాలన్నారు.ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పాలనలో వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు.రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కృషితో హనుమాన్ నగర్ పత్తికుంట (వినాయక సాగర్)లో రాబోయే రోజుల్లో అందంగా తీర్చిదిద్దడానికి,వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు జరుగుతాయన్నారు.మండపాల నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలకుండా ఊరేగింపు చేయాలన్నారు.పత్తి కుంట,పల్లె చెరువు వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.సమావేశానికి అధ్యక్షత వహించిన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్,అత్తాపూర్,కిస్మత్ పూర్,బండ్లగూడ,చాంద్రాయణగుట్ట,పాతబస్తీలోని ప్రాంతాలన్నిటిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అందుకోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు కదలాల్సిన అవసరం ఉందన్నారు.బాలాపూర్ గణేష్ నిమజ్జన ర్యాలీ రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పాతబస్తీ రోడ్ల గూండా వెళ్తున్న నేపథ్యంలో ఆ రహదారులను కూడా బాగు చేయడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.వినాయక మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించి శాంతియుతంగా నిమజ్జనోత్సవాలు జరిగేలా చూడాలన్నారు.ఈ సంవత్సరం మీరాలం చెరువు వద్ద పనులు జరుగుతున్నందువల్ల అక్కడ నిమజ్జనాలు ఉండవన్నారు.మండపాల నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలి:రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్..వినాయక మండపాలు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని,అలా చేసినట్లయితే బందోబస్తుకు ఇబ్బందులు ఉండవన్నారు.వినాయక చవితి,నవరాత్రులు,నిమజ్జోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.మండపాల వద్ద అనుమానితులు ఎవరైనా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.అనుమతుల పేరిట ఇబ్బందులు పెట్టవద్దు:భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్..అనుమతుల పేరిట మండపాల నిర్వాహకులను ఇబ్బందులు పెట్టవద్దని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ అన్నారు.అనుమతులు అనే దాని బదులు ఇంటిమేషన్ ఇస్తే చాలు అని అంటే బాగుంటుందన్నారు.గణేష్ నిమజ్జోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు.కిస్మత్ పూర్,పీరం చెరువు ప్రాంతాలలో నిమజ్జన పాయింట్లను పెట్టీ అన్ని సౌకర్యాలు కల్పించాలి:మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్..కిస్మత్ పూర్,పీరం చెరువు ప్రాంతాలలో నీటి సౌకర్యం ఉన్నచోట నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేసి క్రేన్,విద్యుత్,ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్,గోకరి సురేష్ గౌడ్ లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను వన్ వే గా పోనివ్వాలి:భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ వై శ్రీధర్..హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను కుడివైపు రోడ్డు గుండా వన్వేలో వెళ్ళేటట్లు చూడాలన్నాని భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ వై శ్రీధర్ కోరారు.పత్తికుంట వైపు ఉన్న రోడ్డులో కేవలం వినాయక నిమజ్జనోత్సవాల వాహనాలకే ఉపయోగించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనాలు జరిగే ప్రాంతాలలో ముందుగానే ఏర్పాట్లు చేయాలన్నారు.కరెంటు తీగెలను సరి చేయాలి..శివరాంపల్లి ఎం ప్రభాకర్ రెడ్డ.. శివరాంపల్లి పెద్ద వినాయకుడు ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లడం జరుగుతుందని,కరెంటు తీగలను విద్యుత్ అధికారులు సరిచేయాలని ఆ బస్తీకి చెందిన ఎం ప్రభాకర్ రెడ్డి కోరారు.గత సంవత్సరం విద్యుత్ వైర్లు తగడం తగలడం వల్ల చాలా ఇబ్బందులు కలగాయన్నారు.గడచిన 18 సంవత్సరాలుగా ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ నాయకత్వంలో వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఇంద్ర పాల్ రెడ్డి అన్నారు.ఈ సంవత్సరం కూడా అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే,భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఆలె భాస్కర్ రాజ్,కార్యదర్శి కె మహేందర్,సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్ మల్లారెడ్డి,బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్,రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్,రాజేంద్రనగర్ జోనల్ ఎస్ ఈ నరేందర్ గౌడ్,రాజేంద్రనగర్ విద్యుత్ డీఈ రత్నాకర్ రావు,రాజేంద్రనగర్,అత్తాపూర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు బి సురేందర్ రెడ్డి,మల్లారెడ్డి,జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ అలీ,జీహెచ్ ఎంసీ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన సత్యనారాయణ రెడ్డి,నాయకులు ఎన్ ధనుంజయ,జోగి రవి తదితరులు పాల్గొన్నారు.

## రెజొనెన్స్ స్కూల్ వీ.డి.వోస్ కాలనీలో మెహందీ వేడుకలు




**ఖమ్మం, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం వీ.డి.వోస్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో చిన్నారుల కోసం మెహందీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్లో బాలికలు ఒకరి చేతికి ఒకరు అందమైన మెహందీ డిజైన్లను వేసుకున్నారు. వివిధ రకాల సంప్రదాయ, ఆధునిక డిజైన్లతో చిన్నారులు చేతులు కళకళలాడాయి. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు కూడా చిన్నారులకు మెహందీ వేయడంలో సహాయపడ్డారు. విద్యార్థులు తమక ఇష్టమైన డిజైన్లను ఎంచుకొని, వాటిని తమ చేతులపై వేసుకుని ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్ర కూమార్, కె. శ్రీధర్ రావు మాట్లాడుతూ విద్యాపరమైన నైపుణ్యాలను మాత్రమే కాకుండా, వారిలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికి తీయడం మా లక్ష్యం. మెహందీ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు పిల్లలలో సృజనాత్మకతను, సాంస్కృతిక అవగాహనను పెంపొందిస్తాయి. మన సంంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని పేర్కొన్నారు. ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు, దీని వెనుక ఎన్నో ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో గోరింటాకు ఆషాఢ మాసంలో ఒక ముఖ్యమైన భాగం, గోరింటాకును శుభానికి, సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారు ఆరోగ్య ప్రయోజనాలు శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, నరాల ఉపశమనం, రక్తప్రసరణ మెరుగుదల అనేక రకాల వ్యాధులను నియంత్రిస్తుందని తెలిపారు.పాఠశాల డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో నేర్చుకునే ప్రతి అంశం వారి భవిష్యత్తుకు పునాది కావాలి. ఈ మెహందీ వేడుకలు పిల్లలకు ఆనందాన్ని ఇవ్వడమే, కాకుండా, వారిలో సహకారం, సృజనాత్మకత, సామాజిక ఐక్యత వంటి విలువలను పెంపొందిస్తాయి. ప్రతి విద్యార్థి తమ బాల్యాన్ని ఆనందంగా గడపడంతో పాటు, నూతన విషయాలను నేర్చుకోవాలని కొరుకుంటున్నాము. అని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు .మెహందీ ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వస్పుల ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో మెడికల్ క్యాంపు




**మిడ్జిల్, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** మిడ్జిల్: మండలంలోని వస్పుల ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో డా. మీర్జా అలీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 115 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్య బృందం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ఆరోగ్య సంరక్షణపై పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది అయ్యుబ్ ఖాన్, సంపత్ కుమార్, పారిజాత, జంగయ్యతో పాటు హాస్టల్ వార్డెన్ రవికుమార్, లక్ష్మమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు భేష్

### : ఎన్.సి.డి.సి కన్సల్టెంట్ డాక్టర్ సామ్ జాన్ ప్రశంస





వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**ఖమ్మం, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్ సిడిసి) కన్సల్టెంట్ డాక్టర్ సామ్ జాన్ (స్టేట్ పబ్లిక్ హెల్త్ అవుట్‌బ్రేక్ బృందం) గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలో అమలవుతున్న 10 రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.అనంతరం ఆయన ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, జిల్లా పబ్లిక్ హెల్త్ లాబొరేటరీ (ఐడిఎస్ పి ల్యాబ్)లను సందర్శించి, ఆయా ల్యాబ్‌లలో జరుగుతున్న పరీక్షలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మామిళ్లగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు అందుతున్న తీరును నేరుగా వెరిఫై చేశారు.టీకా కార్యక్రమం (విపిడి) పట్ల ప్రత్యేక అభినందనలు. జిల్లాలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అత్యంత సమర్థవంతంగా అమలవుతుండటం పట్ల డాక్టర్ సామ్ జాన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యాక్సిన్ల ద్వారా నివారించదగిన వ్యాధుల నియంత్రణ కార్యక్రమం అమలు తీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సమయంలో, కార్యక్రమాలకు సంబంధించిన కీలక సూచికలను మరింత మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేయాలని, కొన్ని కీలక సూచనలను అధికారులకు అందించారు.ఈ సమీక్షా సమావేశంలో మరియు క్షేత్రస్థాయి పర్యటనలో ఐడిఎస్పి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఐ. మోథ్యా, ఎన్సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణాదేవి, ఇన్చార్జ్ ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ ఇ. సాయి కుమార్, జిల్లా డేటా మేనేజర్ (డిడిఎం ) కె. కృష్ణమోహన్, ఎంపిహెచ్ఎస్ (ఎం) ఎ. సతీష్ తదితర

## ఖమ్మం నగరంలో వర్షాకాలం దృష్ట్యా పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వీడాలి -ప్రభుత్వానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచన



**ఖమ్మం, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** వర్షాకాలం నేపథ్యంలో ఖమ్మం నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు.
నగరంలో పలుచోట్ల చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు పూడుకుపోవడం, వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సదుపాయాలు కల్పించి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.నిల్వ నీరు ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా మందుల పిచికారీని క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు. వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని పేర్కొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పనిచేయాలని, పారిశుద్ధ్యంపై ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఓటరు ప్రక్రియ ఆగస్టు 3తో ముగియనుంది త్వరపడి అప్లై చేసుకోండి:అందే లక్ష్మణరావు

**రాజేంద్రనగర్, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతికి లోబడి చట్టబద్ధతగా ఓటు హక్కు డిజిటలైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టారు.ఈప్రక్రియ ఆగస్టు 3 తో ముగియనుండగా మణికొండ,నెక్నంపుర్ డివిజన్ ప్రజానీకం స్పందించి,ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కను వజ్రాయుధంగా పరిగణనలోకి తీసుకుని, ఓటు హక్కు కోల్పోవద్దనే సదుద్దేశంతో కొంత మంది తమ తమ ఓటును డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా సద్వినియోగ పరుచు కోవడానికి గురువారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు పంచవటి కాలనీ గ్రంథాలయంకి,మరి కొంత మంది స్థానికులు ఉదయం 11 నుండి 2 సాయంత్రం 4 నుండి 7 వరకు షిర్డీ సాయి నగర్ శ్రీ చైతన్య కాలనీకి విచ్చేయడం ద్వారా ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సహాయ శిబిరంలో వారికి భారత రాష్ట్ర సమితి స్థానిక నేతలు అందే లక్ష్మణ్ రావు, సుమనళిని,సంగం శ్రీకాంత్,జయరాం,తిరుపతి తదితరులు ఓటు వివరాలను తెలుపుతూ,2002లో వారి యొక్క లేదా వారి పరివారం సభ్యుల



ఓటు వివరాలను తెలుసుకొని ఎన్యూమరెశన్ ధరకాస్తూ ఫారం పూరించి మ్యాపింగ్ చేయడంలో సంపూర్ణ సహకారాన్ని అందచేయడం జరిగిందన్నారు.

## యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈఎస్‌డీపీ శిక్షణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నిరుద్యోగ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎస్‌డీపీ) అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. గుంటూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల యువతకు ర్యాంప్ కార్యక్రమం పరిధిలో ఈ శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఈఎస్‌డీపీ కింద 10 రోజుల పాటు పారిశ్రామికవేత్తగా ఎదగడానికి అవసరమైన అంశాలపై, మరో 10 రోజుల పాటు వివిధ సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ అందజేయనున్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తారు. జిల్లాలో ఇంజినీరింగ్, డిగ్రీ, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, డిప్లొమా, ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో పాటు ఎస్సీ, ఎస్టీ, మహిళలు, బీపీఎల్ వర్గాలు, మాజీ సైనికులు, దివ్యాంగులు, 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఈ శిక్షణకు అర్హులని తెలిపారు.

**ఐటీ, డిజిటల్ సేవలపై ఉచిత శిక్షణ**

యనమదలలోని కిట్స్ అక్షర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చివరి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆగస్టు 3 వరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజిటల్ సర్వీసెస్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అంశాలపై ట్రెడ్జ్ ఐటీ సంస్థ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని కోర్సుల్లో శిక్షణలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 6300609315 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఆగస్టు 1 నుంచి ఉచిత ఆన్‌లైన్ ప్రాథమిక ఉర్దూ కోచింగ్

- 30 రోజుల పాటు తరగతులు.. విద్యార్థులు, యువతకు ఆహ్వానం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఉర్దూ భాషను నేర్చుకోవాలనుకునే విద్యార్థులు, యువతతో పాటు ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా 30 రోజుల ప్రాథమిక ఉర్దూ ఆన్‌లైన్ కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రత్యేక అధికారి షేక్ నాగూర్‌వలి తెలిపారు. ఆగస్టు 1 నుంచి ప్రారంభమయ్యే ఈ కోచింగ్ పూర్తిగా ఉచితంగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఈ శిక్షణలో ఉర్దూ భాషను చదవడం, రాయడం, మాట్లాడడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను సులభమైన పద్ధతిలో బోధిస్తారని తెలిపారు. ఉర్దూ భారతీయ సాంస్కృతిక వారసత్వంలో ముఖ్యమైన భాషగా నిలిచిందని, దీనిని అభ్యసించడం ద్వారా విద్యార్థులకు విద్యా, ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్ స్థాయిలో ఉర్దూ అభ్యసించడం ద్వారా విద్యార్థులు తమ మాతృభాషను పరిరక్షించుకోవడంతో పాటు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాల్లోనూ ప్రయోజనం పొందగలరని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మరిన్ని వివరాలకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రత్యేక అధికారి షేక్ నాగూర్‌వలిని 98851 39827 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## డ్రాయింగ్ మాస్టర్‌కు ఘన సన్మానం!




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** విద్యార్థుల్లో చిత్రలేఖనంపై ఆసక్తిని పెంపొందిస్తూ దశాబ్దాల పాటు డ్రాయింగ్ మాస్టర్‌గా విశిష్ట సేవలందించి పదవీ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుడు విజయ ప్రకాష్ దంపతులను విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విద్యారంగంలో ఆయన అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు.

ఉపాధ్యాయుడిగా పనిచేసిన కాలంలో వేలాది మంది విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ అందించి, అనేక మంది ప్రతిభావంతులుగా ఎదగడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, క్రమశిక్షణ, కళాపట్ల అభిరుచిని పెంపొందించడంలో ఆయన పాత్ర విశేషమని అన్నారు.

ఈ సందర్భంగా డ్రాయింగ్ మాస్టర్ విజయ ప్రకాష్ దంపతులను శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు సలీం భాష, డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, జయంతి బాబు, ఉపాధ్యాయులు ప్రసాద్, వెంకట్, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొని ఆయనకు పదవీవిరమణ శుభాకాంక్షలు తెలిపారు.

## భార్యను హత్య చేసిన కేసులో భర్త అరెస్ట్



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** భార్యను హత్య చేసిన కేసులో భర్తను మైదుకూరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాలు లోకి వెళితే మైదుకూరు మండలం ముత్తరాయపల్లె గ్రామానికి చెందిన దాదన్న గారి ఎల్లయ్య తన భార్య సాలమ్మను అనుమానిస్తూ ఆమె ప్రవర్తన పై విసుకు చెంది గత నెల 28వ తేదీన రోకలిబండతో తలపై కొట్టి హత్య చేశాడు. హత్య చేసి పారిపోయిన యాదన్నను శుక్రవారం మైదుకూరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే రమణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అరోమా రెస్టారెంట్ కడప రోడ్డు వద్ద అరెస్టు చేసి న్యాయస్థానం ముందు రిమాండ్ నిమిత్తం హాజరు పరిచారు.

# కిడ్నాపర్లు, రౌడీలకే జగన్ వత్తాసు : ఎమ్మెల్యే నసీర్

- పొగాకు వ్యాపారి అపహరణపై ప్రజలకు ఏం చెబుతావు ?
- గతంలో బాబాయి హత్యనూ పక్కదోవ పట్టించేయత్నం
- ఇప్పుడు పరామర్శల పేరిట ఆగడాలు
- కేంద్ర మంత్రి పెమ్మసానిని విమర్శించే అర్హత అంబటికి ఉందా ?
- గొడ్డలి పార్టీ తీరును ప్రజలు ఛీకొడుతున్నారు
- ఇంటింటికీ ప్రచారంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** 'ఒక వైపు పొగాకు వ్యాపారం పేరుతో కిడ్నాప్ లకు పాల్పడుతున్న రౌడీలను వెనకేసుకొచ్చే జగన్.. ఇప్పుడు పొగాకు రైతుల పరామర్శలకు వెళ్లడం దుర్మార్గం. గుంటూరులో మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కుమారుడి అరాచకాలు కనిపించడం లేదా ? సీదిరి అప్పలరాజు కుమారుడి దౌర్జన్యాలు తెలియడం లేదా ? రాష్ట్రంలో గొడ్డలి పార్టీది అంతా నీచ సంస్కృతి. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పై అంబటి తీరును ఖండిస్తున్నాం. పెమ్మసానిని విమర్శించే స్థాయి అంబటికి ఉందా ? ఇలాంటి పార్టీని రాష్ట్రం నుంచి తరిమేయాలి' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక 13వ వార్డు చౌత్రా సెంటర్ లో సంక్షేమ పాలన-ఇంటింటికీ ప్రచారంలో భాగంగా మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఇంటికీ వెళ్లి ఒక్కొక్కరి వద్ద సుమారు ఐదు నిమిషాలు కేటాయించారు. ప్రభుత్వం అందిస్తోన్న సేవలను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరులో మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కుమారుడిని, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి వంటి దొంగల ముఠాను వెనకేసుకొస్తోన్న జగన్ పరామర్శల పేరిట పనికిమాలిన యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో భోగాపురం ఎయిర్ పోర్టుకు స్థల సేకరణ, అనుమతులన్నీ పూర్తి చేస్తే జగన్ వచ్చి శంకుస్థాపన చేశారని తెలిపారు. కేవలం ఐదేళ్లలో 26 శాతం మాత్రమే పనులు చేసి 86 శాతం పూర్తి చేసినట్లు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఒకరు చేసిన పనులను తమ ఖాతాలో వేసుకోవాలనే ఆరాటం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బాబాయి హత్యను నరకాసుర వధ పేరిట ప్రచారం చేసిన జగన్.. ఇప్పుడు తమ పార్టీ నేతలను కూడా అలాగే ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కేవలం రెండేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన స్థాయిలో ప్రజలకు అందించామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులతో యువతకు మంచి భవిష్యత్తు అందించబోతున్నామని చెప్పారు. డీఎస్సీ అసత్య ఆరోపణలతో వైసీపీ యువతను పక్కదోవ పట్టిస్తోందని మండిపడ్డారు.

## గుంటూరులో పెరిగిన పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీలకు వివరాలు

- తూర్పులో 312, పశ్చిమంలో 338 పోలింగ్ కేంద్రాలు
- డిప్యూటీ కమిషనర్ సాంబశివరావు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు నియోజకవర్గంలో కొత్తగా 56 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో మొత్తం కేంద్రాల సంఖ్య 312కు, పశ్చిమ నియోజకవర్గంలో కొత్తగా 48 కేంద్రాలు కలిపి మొత్తం 338కు పెరిగిందని తూర్పు నియోజకవర్గ సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్‌ఓ), డిప్యూటీ కమిషనర్ జి. సాంబశివరావు తెలిపారు.

నగరపాలక సంస్థ కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఓటర్ల సంఖ్య పెరగడంతో పోలింగ్ కేంద్రాల సంఖ్యను కూడా పెంచినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామని చెప్పారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతులను రాజకీయ పార్టీలకు అందించడంతో పాటు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో కూడా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన గైర్హాజరు, నివాస మార్పు, మరణించిన ఓటర్ల (ఏఎస్‌డీ) జాబితాలను కూడా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు పేర్కొన్నారు.

సమావేశంలో ఏఈఆర్‌ఓలు సూరజ్ కుమార్, బి. శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్లు నాగమల్లేశ్వరరావు, సుధా కిరణ్మయి, సూపరింటెండెంట్ బాలాజీ బాషా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## యువతకు మత్తు పదార్థాల దుష్ప్రభావాల గురించి అవగాహన



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల నందు శుక్రవారం నాడు ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) మరియు నెహ్రూ యువ కేంద్రం మై భారత్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల దుష్ప్రభావాల గురించి వాటి వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ కార్యక్రమం చేయించడం జరిగింది సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ముడియం గురు స్వప్న నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఆఫీసర్ రవి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో మత్తు పదార్థాల వినియోగం అధికమవుతుందని దీనివల్ల ప్రపంచానికి పెనుముప్పు తలెత్తే అవకాశం ఉన్నందున మత్తు పదార్థాలను వినియోగించడం పూర్తిగా నిర్మూలించాలని మత్తు పదార్థాలు రహిత సమాజ జీవనానికి ప్రతి ఒక్కరూ కృషిచేసి సమాజానికి మత్తు పదార్థాలను దూరం చేసే విధంగా విద్యార్థులకం యువత ముందుకు వచ్చి చొరవ చూపాలని ముందుగా మనం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మన తోటి స్నేహితులకు బంధువులకు ఇరుగుపొరుగు వారికి మత్తు పదార్థాల అనర్థాల గురించి వాటి వలన జరిగే చెడు ప్రభావాల గురించి అవగాహన కల్పిస్తూ నవ సమాజ నిర్మాణానికి ఆరోగ్యవంతమైన చైతన్యవంతమైన సాధికార కరిగిన యువశక్తిగా ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్ అధ్యాపకులు శోభారాణి రమణ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, సవరణలకు అవకాశం
- నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ-2026లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శుక్రవారం విడుదల చేసినట్లు గుంటూరు తూర్పు ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్‌ఓ), నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సవరణలు, కొత్త ఓటర్ల నమోదు కోసం ఆగస్టు 30 వరకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కమిషనర్ మాట్లాడుతూ, జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు అందిన అభ్యంతరాలు, దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని, అనంతరం అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను భారత ఎన్నికల సంఘం విడుదల చేస్తుందని తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. ప్రజలు తమ పేర్లను వోటర్ హెల్ప్‌లైన్ లేదా ఈసీఐ మొబైల్ యాప్‌ల ద్వారా కూడా పరిశీలించుకోవచ్చన్నారు.

ఓటర్ల జాబితాకు సంబంధించిన అభ్యంతరాలు, సవరణల దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా, సంబంధిత బీఎల్‌ఓలకు లేదా నగరపాలక సంస్థ ఎన్నికల విభాగంలో సమర్పించవచ్చని తెలిపారు. ఓటు హక్కుకు అర్హత సాధించిన వారు ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ మయూర్ అశోక్ సూచించారు.

## నాలుగు దశాబ్దాల సేవకు గౌరవ వందనం..

- పోలీసు అధికారులకు ఘన వీడ్కోలు
- పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీసు శాఖలో 36 నుంచి 42 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేసి వారి సేవలను అభినందించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సుదీర్ఘ సేవా కాలంలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించిన ఈ అధికారులు పోలీసు శాఖకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. నక్సలిజం, రౌడీయిజం తీవ్రంగా ఉన్న క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహించి పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చడం కూడా ప్రశంసనీయమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఎం. గంగాధర్ రావు, తెనాలి-2 టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ టీ. హైమరావు, హెడ్ కానిస్టేబుల్ ఎం. రమేష్ బాబు, డీఏఆర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ వి. బసవయ్య, తెనాలి తాలూకా పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ బి. శ్రీనివాసరావులను ప్రత్యేకంగా సత్కరించారు. పదవీ విరమణ అనంతరం వారు ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్ బాబు, ఎంటీ ఆర్ఐ హరిరెడ్డి, పోలీస్ అసోసియేషన్ నాయకులు, సీఐ శివప్రసాద్, పీఆర్వో శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆగస్టు 2 నుంచి తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో రైతు బజార్లు, రైస్ మిల్లుల అవుట్‌లెట్ స్టోర్ల ద్వారా తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాలను ఆగస్టు 2వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులు, వ్యాపారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గుంటూరు పశ్చిమ మండలంలోని చుట్టుగుంట రైతు బజార్, గుంటూరు తూర్పు మండలంలోని బస్టాండ్ రైతు బజార్, పొన్నూరు రైతు బజార్, తెనాలి జీఐ రైతు బజార్, మంగళగిరి మార్కెట్ యార్డులోని రైతు బజార్, తాడికొండలోని శ్రీరామ అప్పాజీ నిలయం, గాంధీ బొమ్మ సెంటర్, ప్రతిపాడులోని విజయకృష్ణ జనరల్ స్టోర్స్‌లో తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పాలేపు శ్రీనివాసులుపై చట్టపరంగా కేసు నమోదు చేయాలి



- నా వ్యక్తిగత గౌరవాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు
- దత్తాత్రేయ స్వామి


**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం స్థానిక పోలీస్ స్టేషన్లో పాలెపు శ్రీనివాసులపై చట్టపరమైన తెలుగు తీసుకోవాలని బ్రహ్మంగారిమఠం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారి సోదరులు దత్తాత్రేయ స్వామి మరియు వారి మిత్రులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే బ్రహ్మంగారిమఠం కంది మల్లయ్య పల్లె జిల్లా పరిషత్ హై స్కూల్ నందు 1991 నుండి 1992 వరకు పదవ తరగతి విద్యను అభ్యసించిన విద్యార్థినీ విద్యార్థులు కలిసి స్నేహితుల సమావేశం (గెట్ టు గేదర్ ) ఏర్పాటు చేసుకున్నారు. దానిలో భాగంగా స్నేహితులంతా కలిసి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి దర్శించుకుని స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ బాలల పాఠశాలకు ర్యాలీగా వెళుతూ బ్రహ్మంగారిమఠం నాలుగు రోడ్ల సెంటర్ నందు సరదాగా తన చిన్ననాటి మిత్రులతో కలిసి ఒక పాటకు దత్తాత్రేయ స్వామి డ్యాన్స్ వేయడం జరిగింది. ఆ డాన్స్ వేసిన వీడియో వాట్సప్ గ్రూపులలో రాగా పాలకు శ్రీనివాసులు అనే వ్యక్తి ఆ వీడియోను వివిధ మాధ్యమాలలో పంపుతూ మఠాధిపతులు తమ్ముడు అయి ఉండి ఇలా ముత్యం చేయవచ్చా అంటూ నృత్యంతో పాటు ఒక చేతిలో మందు బాటిల్ ఇంకొక చేతిలో మగువ ఉంటే బాగుండు అని అవహేళన చేస్తూ ఆయన వ్యక్తిగత గౌరవాన్ని కించపరుస్తూ తనతోపాటు తనకు తెలిసిన స్నేహితులతో కలిసి వివిధ మాధ్యమాలలో ప్రచారం చేయడం జరిగింది. దీనిలో భాగంగా దత్తాత్రేయ స్వామి మరియు వారి మిత్రులు మరియు స్థానికులు కొందరు కలిసి బ్రహ్మంగారిమఠం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి కచ్చితంగా చట్టపరంగా కేసు నమోదు చేయాలని వారు కోరారు.

## ఉద్యోగ విరమణ చేసిన ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సత్కరించిన ఉద్యోగులు!



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి సహాయ మలేరియా అధికారిగా పని చేసి ఉద్యోగ విరమణ చేయుచున్న చిరసాని ప్రభాకరరెడ్డి ని తోటి ఉద్యోగులు ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖలో సుదీర్ఘ సేవలు అందించి ఉద్యోగ విరమణ చేయుచున్న తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి కి ఏర్పాటుచేసిన అభినందన సత్కార సభకు ముఖ్యఅతిథిగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి మునిసిపల్ కమిషనర్ జాస్తి రామారావు, ఇన్చార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, యుయల్ బి సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి, సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ గుద్ధంటి రవికుమార్, గుంటూరు సబ్ యూనిట్ అధికారి సూదశివ గణేష్, సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల శివరాం ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్స్ మలేరియా ఫైలేరియా, ఈమని, కొలకలూరు, సంగం జాగర్లమూడి, చేబ్రోలు, వేజెండ్ల, పిహెచ్సిల ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్‌గా మాలేపాటి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్ గా బ్రహ్మంగారిమఠం మాజీ మండల అధ్యక్షుడు రేకలకుంట కు చెందిన మాలేపాటి సుబ్బారావుని నియమించడం జరిగింది.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం



○ **88 యూనిట్ల రక్తం సేకరణ.. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన విద్యార్థులు**

**విశాదల, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా విశాదలలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని మొత్తం 88 యూనిట్ల రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేశారు. సేకరించిన రక్తాన్ని గుంటూరులోని నీడ్స్ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి. సంజయ్ మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి అవసరమైన వారికి ప్రాణదాతగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు.

కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బాషా, నీడ్స్ బ్లడ్ బ్యాంక్‌కు చెందిన శివాజీ రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల కార్యదర్శి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తూ, సామాజిక బాధ్యతతో ముందుకొచ్చిన వారి సేవా స్ఫూర్తి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

## ప్రమాదాలకు గురైన విద్యుత్ ఉద్యోగులకు క్షేత్రస్థాయి విధుల నుంచి మినహాయింపు



○ **ఏపీ సీపీడీసీఎల్ సీఎండీకి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వినతి**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన విద్యుత్ శాఖ ఉద్యోగులకు క్షేత్రస్థాయి విధుల నుంచి మినహాయింపు కల్పించి కార్యాలయాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. ఈ మేరకు ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్, లైన్‌మెన్ తదితర ఉద్యోగులు విధి నిర్వహణలో కరెంట్ షాక్‌కు గురికావడం, విద్యుత్ స్తంభాలపై నుంచి పడి తీవ్రంగా గాయపడుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. గాయాల నుంచి కోలుకున్న అనంతరం తిరిగి క్షేత్రస్థాయిలో స్తంభాలు ఎక్కాల్సి రావడం, ఇతర కఠినమైన విధులు నిర్వహించాల్సి రావడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీంతో పాత గాయాలు మళ్లీ తిరగబడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు.

విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన ఉద్యోగులను క్షేత్రస్థాయి విధుల నుంచి మినహాయించి కార్యాలయాల్లో నియమించాలని సీఎండీని కోరినట్లు తెలిపారు.

వినతిపై స్పందించిన ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, ప్రమాదాలకు గురైన ఉద్యోగుల సమస్యపై సంబంధిత అధికారుల నుంచి ప్రతిపాదనలు అందిన వెంటనే పరిశీలించి, అర్హులైన ఉద్యోగులకు క్షేత్రస్థాయి విధుల నుంచి మినహాయింపు ఇచ్చి కార్యాలయాలకు బదిలీ చేసే అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సురేష్ బాబు తెలిపారు.

## ఆగస్టు 5న విజయవాడలో బీజేపీ ఓబీసీ మోర్చా 'చేనేత సమ్మేళనం'



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆగస్టు 5న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'చేనేత సమ్మేళనం' నిర్వహించనున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీశ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముందు బీజేపీ రాష్ట్రకార్యాలయం నుంచి 'వీ స్టాండ్ విత్ మోదీ' నినాదంతో భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చేనేత భారతీయ సంస్కృతి, సంప్రదాయం, స్వదేశీ స్ఫూర్తికి ప్రతీక అని, స్వాతంత్ర్య ఉద్యమంలో ఖాదీ, చరఖా జాతీయ చైతన్యానికి చిహ్నాలుగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ నేతన్నల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన చేనేత రౌండ్‌టేబుల్ సమావేశంలో 'నేతన్నల సేవ' పథకానికి సంబంధించిన వయోపరిమితి, మగ్గం తదితర నిబంధనలపై చర్చించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 187 (29-07-2026) ద్వారా సవరణలు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

చేనేత కార్మికుల సమస్యలను బీజేపీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. చేనేత కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా లక్షలాది కుటుంబాల జీవనాధారమని, ప్రతి మగ్గం వెనుక ఒక కుటుంబం ఆశ, ప్రతి నూలుపోగులో ఒక కళాకారుడి శ్రమ, ప్రతి చేనేత వస్త్రంలో భారతీయ సంస్కృతి ప్రతిబింబిస్తుందని రొంగల గోపీశ్రీనివాస్ పేర్కొన్నారు. చేనేత కార్మికులు, సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, చేనేత అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ర్యాలీ, ప్రదర్శనలు, సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్ : మంత్రి పార్థసారథి



**భోగాపురం, జూలై 31 (జర్నలిస్ట్ ఫైల్):** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, ఈ ప్రాజెక్టు ప్రాంత అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. భోగాపురం విమానాశ్రయం వద్ద శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మూడు లక్షలకు పైగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజల రాకపోకల కోసం ఇప్పటికే 5 నుంచి 6 వేల బస్సులు ఏర్పాటు చేశామని, ప్రజాప్రతినిధులు కూడా మినీ బస్సులు, ఇతర వాహనాలను అందుబాటులో ఉంచుతున్నారని వెల్లడించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రూ.17,900 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం జరగనుందని తెలిపారు. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం పర్యవేక్షిస్తుండగా, మంత్రి నారా లోకేష్ ప్రతిరోజూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నారని చెప్పారు.

భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాధాన్యం, ఉత్తరాంధ్ర అభివృద్ధి అవకాశాలను ప్రజలకు చేరవేసేందుకు సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో సుమారు 200 హోర్డింగ్స్, 50 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఐదు డ్రోన్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. డిజిటల్, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా విస్తృత ప్రచారం కొనసాగుతోందన్నారు.

విమానాశ్రయంలో 25 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన కార్గో టెర్మినల్ అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్ర నుంచి దేశ, విదేశాలకు ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. దీంతో ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు కొత్త ఊపు లభించడంతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తాయని చెప్పారు. ఇప్పటివరకు ఉపాధి కోసం వలస వెళ్లే ప్రాంతంగా ఉన్న ఉత్తరాంధ్ర, భవిష్యత్తులో ఇతర ప్రాంతాల వారికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీటిని తరలించే కార్యక్రమాన్ని ఆగస్టు 14న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఈ కార్యక్రమంతో సాగు, తాగునీరు, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు విశేష ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ఉత్తరాంధ్ర భవిష్యత్తు బంగారుమయంగా మారుతుందని పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురం సభ సన్నాహాల్లో ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు



**భోగాపురం (విజయనగరం) (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పాల్గొన్నారు. గజపతినగరం నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన ఆయన విమానాశ్రయం అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు.

ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరగనున్న విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేందుకు చేపడుతున్న ఏర్పాట్లపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గజపతినగరం నియోజకవర్గంలో జనసమీకరణ, ప్రజాప్రతినిధులు--పార్టీ నాయకుల సమన్వయం, రవాణా, సభ నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని నక్కా ఆనంద బాబు సూచించారు. ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రూ.5,641 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం పారిశ్రామిక, పర్యాటక, వాణిజ్య రంగాలకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. 25 వేల మెట్రిక్ టన్నుల కార్గో నిర్వహణ సామర్థ్యం, 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో ప్రారంభమై, భవిష్యత్తులో నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు విస్తరించే అవకాశముందని చెప్పారు. మామిడి, మత్స్య ఉత్పత్తుల వంటి ఎగుమతులకు ఈ విమానాశ్రయం ద్వారా మరింత ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు.

విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు నామకరణం చేయడం ఆయన త్యాగానికి శాశ్వత గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. బీచ్ కారిడార్ అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణలో ఈ విమానాశ్రయం కీలక పాత్ర పోషించనుందని అభిప్రాయపడ్డారు.

సమీక్ష అనంతరం ప్రధాన వేదిక, వీఐపీ గ్యాలరీ, ప్రజల కూర్చునే ప్రాంతాలు, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను నక్కా ఆనంద బాబు ప్రత్యక్షంగా పరిశీలించి, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు అవసరమైన సూచనలు చేశారు...

## భోగాపురంతో ఏపీకి గ్లోబల్ గేట్‌వే : బీజేపీ మాధవ్

○ **ప్రధాని మోదీ చేతుల మీదుగా నేడు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం**



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో మరో స్వర్ణాధ్యాయమని, రాష్ట్రాన్ని ప్రపంచంతో అనుసంధానించే గ్లోబల్ గేట్‌వేగా ఇది నిలవనుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రజల తరపున హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం మౌలిక సదుపాయాల ప్రాజెక్టు మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రగతికి నూతన ద్వారమని పీవీఎన్ మాధవ్ అన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ అనుసంధానం బలోపేతం కావడంతో పాటు విదేశీ పెట్టుబడులు, పారిశ్రామికీకరణ, పర్యాటకం, ఐటీ, ఎగుమతుల రంగాలకు కొత్త ఊపు లభిస్తుందని, లక్షలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. రహదారులు, జాతీయ రహదారులు, రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానయాన రంగాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రాన్ని దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక శక్తిగా నిలబెడుతున్నాయని వివరించారు.

భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయి విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దే సామర్థ్యం కలిగి ఉందని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది కొత్త ఇంధనంగా మారుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ప్రపంచంతో రాష్ట్ర అనుసంధానానికి ఇది నూతన ద్వారంగా నిలవడంతో పాటు పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక రంగాల విస్తరణకు బలమైన వేదికగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.


భోగాపురం విమానాశ్రయ ప్రారంభం అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రతీకగా నిలుస్తుందని, ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని రాష్ట్ర ప్రజలందరూ గర్వంగా స్వాగతించాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

## విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వాతావరణ మార్పుల నేపథ్యంలో బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు. గుంటూరు బీసీ హాస్టల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఐరన్ మాత్రలు తీసుకున్న తర్వాత అస్వస్థతకు గురై ప్రస్తుతం కోలుకుంటున్నారని, పూర్తిగా కోలుకునే వరకు వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. హాస్టళ్లలో వేడి చేసి చల్లార్చిన తాగునీరు, తాజా ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రత పాటించాలని, అవసరమైతే వైద్య శిబిరాలు నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం సహించబోమని, వారిని సొంత బిడ్డల్లా చూసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

## ఒకే రోజులో మెడికల్ బోర్డు పరీక్షలు.. 32 మందికి ధ్రువపత్రాల జారీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా లోకల్ క్యాడర్ రీ-ఆర్గనైజేషన్ ప్రక్రియ కోసం జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య బోర్డు ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక మెడికల్ బోర్డు శుక్రవారం 36 మంది ఉద్యోగులను పరీక్షించింది.

వివిధ విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం అర్హత సాధించిన 32 మందికి సంబంధించిన వైద్య ధ్రువపత్రాలను అదే రోజు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన రోజే ధ్రువపత్రాలు జారీ చేయడం ప్రభుత్వం అమలు చేస్తున్న వేగవంతమైన, పారదర్శక పరిపాలనకు నిదర్శనమని ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గ ప్రసాద్ తెలిపారు. త్వరితగతిన సేవలు అందించడం ద్వారా ఉద్యోగులకు అనవసర జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## భోగాపురం విమానాశ్రయం, ఈ20 ఇథనాల్‌తో అభివృద్ధికి కొత్త ఊపు : బీజేపీ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ20 ఇథనాల్ బ్లెండింగ్ విధానం దేశ అభివృద్ధి, రైతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు కీలక మైలురాళ్లని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ తాడువాయి రామకృష్ణ పేర్కొన్నారు. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

రూ.4,727 కోట్ల వ్యయంతో 2,703 ఎకరాల్లో నిర్మించిన భోగాపురం విమానాశ్రయానికి 3,800 మీటర్ల రన్‌వే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులు, 25 వేల మెట్రిక్ టన్నుల కార్గో నిర్వహణ సామర్థ్యం కలిగి ఉండనున్న ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందని పేర్కొన్నారు. మామిడి, జీడిపప్పు, సముద్ర ఆహారం, ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులకు ఇది ఊతమివ్వడంతో పాటు, ఏవియేషన్ హబ్, ఎంఆర్వో, పైలట్ శిక్షణ కేంద్రం, ఎడ్యుసిటీ వంటి ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విశాఖ, గంగవరం, ములపేట పోర్టులతో పాటు విశాఖ--చెన్నై పారిశ్రామిక కారిడార్‌తో అనుసంధానం ద్వారా ఉత్తరాంధ్రను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ20 ఇథనాల్ బ్లెండింగ్ విధానం ద్వారా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ వినియోగం పెరగడంతో చమురు దిగుమతులు తగ్గి విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని తాడువాయి రామకృష్ణ తెలిపారు. చెరకు, మొక్కజొన్న రైతులకు కొత్త మార్కెట్ లభించి వారి ఆదాయం పెరుగుతుందని, దేశీయ బయోఫ్యూయల్ ఉత్పత్తి ప్రోత్సాహం పొందడంతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం మరింత బలోపేతమవుతుందని చెప్పారు. కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ విధానం దోహదపడుతుందని పేర్కొన్నారు.

భోగాపురం విమానాశ్రయం, ఈ20 ఇథనాల్ బ్లెండింగ్ వంటి కార్యక్రమాలు దేశాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే కాకుండా రైతుల జీవన ప్రమాణాల మెరుగుదలకు, స్వచ్ఛమైన భారత నిర్మాణానికి కీలకంగా నిలుస్తాయని తాడువాయి రామకృష్ణ అభిప్రాయపడ్డారు.

## ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక ఇడెక్స్ - 2026 అవార్డులు

○ **ఇంజినీరింగ్, లిబరల్ ఆర్ట్స్, బిజినెస్ స్కూళ్లకు జాతీయ స్థాయి గుర్తింపు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** విద్యా రంగంలో నాణ్యత, ఆవిష్కరణలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన బోధనలో విశిష్ట ప్రతిభ కనబరుస్తున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మరోసారి జాతీయ స్థాయిలో తన సత్తాను చాటుకుంది.

ఇండియన్ ప్రెన్యూర్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో చెన్నైలో నిర్వహించిన ఈ ఏడాది పురస్కారాల ప్రధాన కార్యక్రమంలో ఎస్ ఆర్ ఎం విశ్వవిద్యాలయం మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకుంది.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్ , ఈశ్వరి స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ , పారి స్కూల్ ఆఫ్ బిజినెస్‌లు విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డులను అందుకున్నాయి.

చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ విద్య పరిశోధక సంస్థ రెక్టార్ డాక్టర్ విశ్వనాథన్ ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులను ప్రధానం చేశారు.







పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన బోధన, అత్యున్నత పరిశోధనలు, అద్భుతమైన ప్లేస్‌మెంట్లు, ఆధునిక ఇంజినీరింగ్ కోర్సుల నిర్వహణకు గుర్తింపుగా స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్ కు "బెస్ట్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ది ఇయర్-2026 (దక్షిణ భారతదేశం)" అవార్డు లభించింది.

బహుళశాఖల విద్యలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు ఈశ్వరి స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ కు "బెస్ట్ లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ఆఫ్ ది ఇయర్-2026" అవార్డు దక్కగా, మేనేజ్‌మెంట్ విద్యను సాంకేతికత, ఆవిష్కరణలు, నాయకత్వ నైపుణ్యాలు, అనుభవాధారిత అభ్యాసంతో సమన్వయం చేసినందుకు పారి స్కూల్ ఆఫ్ బిజినెస్ కు "బెస్ట్ బి-స్కూల్ ఆఫ్ ది ఇయర్-2026 (ఆంధ్రప్రదేశ్)" అవార్డు లభించింది.

ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఈ గుర్తింపు విశ్వవిద్యాలయం సాధిస్తున్న అకాడమిక్ ప్రగతికి నిదర్శనమన్నారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, వ్యవస్థాపకత తదితర అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ ను సాధిస్తూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్ తరఫున డీన్ ప్రొఫెసర్ సి.వి. టోమీ, పారి స్కూల్ ఆఫ్ బిజినెస్ తరఫున అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నఫీసతుల్ బసరియా మహమ్మద్ ఇక్బాల్, ఈశ్వరి స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ తరఫున సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ అయేషా పర్వీన్ హరూన్ అవార్డులను అందుకున్నారు.

ఈ అవార్డులు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ-ఏపీ అకాడమిక్ నాణ్యత, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమలతో అనుసంధానమైన విద్య, సమాజాభివృద్ధికి దోహదపడే బోధనలో పాటిస్తున్న ఉన్నత ప్రమాణాలకు నిదర్శనంగా నిలిచాయి.

అంతర్జాతీయ భాగస్వామ్యాలు, అత్యాధునిక పరిశోధనలు, బహుళశాఖల విద్యకు ప్రాధాన్యతనిస్తూ భారతదేశంలోని ప్రముఖ ఉన్నత విద్యాసంస్థగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ-ఏపీ తన ప్రస్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటుంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467